నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
సోమవారం | డిసెంబర్ 16, 2024 | www.navatelangana.com

## మానవత్వం చాటిన జర్నలిస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఓ అభ్యర్థి పరీక్ష మిస్ కాకుండా అత్యవసర సమయంలో ఓ జర్నలిస్ట్ సహాయం చేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని పరీక్ష కేంద్రమైన కాన్వెంట్ పాఠశాలకు ఉట్నూర్‌కు చెందిన అభ్యర్థి సురేఖ కేంద్రానికి 9.20 నిమిషాలకు చేరుకున్నారు. అయితే ఇదే పరీక్ష కేంద్రం పేరుతో మరొకటిరూరల్‌లో ఉంది. రూరల్ పరీక్ష కేంద్రం అనుకోని పట్టణ పరీక్ష కేంద్రానికి అభ్యర్థి వచ్చింది. సమయం లేదు.. ప్రయాణమేమో దూరం ఉంది. అప్పుడే అక్కడున్న ప్రముఖ ఛానల్ ఎన్టీవీ ఉమ్మడి జిల్లా స్టాఫర్ అంబటి సారంగపాణి స్పందించి స్వయంగా తన బైక్ మీద ఎక్కించుకో పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లి లోపలికి వెళ్లేలాగా ప్రయత్నం చేసి తన మానవత్వాన్ని చాటారు. దీంతో ఆమె ఆ జర్నలిస్ట్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

## బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-సిరికొండ



కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఇమామ్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. కాగా విషయం తెలుసుకున్న బోథ్ నియోజకవర్గ నాయకులు సభావత్ శ్రీనివాస్ నాయక్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మృతిపట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో బాస్కర్‌రెడ్డి, బాపూరావు, లక్ష్మణ్, గోపి, కిరణ్ పాల్గొన్నారు.

# ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాల్సిందే

- ప్రభుత్వాలు దిగొచ్చే వరకు పోరాటం
- సీఐటీయూ ఆలిండియా కోశాధికారి ఎం.సాయిబాబు
- నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రారంభమైన ఆశా వర్కర్ల బస్సు జాత



నిర్మల్‌లో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-నిర్మల్

హక్కుల సాధనకు కేంద, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచుతామని, ఆశలను వర్కర్లుగా గుర్తించి ఫిక్స్ వేతనం ఇవ్వాలనీ సీఐటీయూ ఆల్ ఇండియా కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆశ వర్కర్ల రాష్ట్ర బస్సు జాతను ప్రారంభించారు. అంతకు ముందు పాత తహసీల్దార్ కార్యాలయ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా స్కీం వర్కర్ల సమస్యలపై సీఐటీయూ అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. ఫలితంగా 2013లో జరిగిన 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశం స్కీం వర్కర్లలో భాగమైన ఆశాలను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని తీర్మాణం చేసిందన్నారు. ఆ తర్వాత 2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు దాటిందని, కానీ 45వ ఐఎల్సీ సిఫారసులు మాత్రం అమలు చేయలేదనీ విమర్శించారు. దీనివల్ల తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా 10 లక్షల మంది ఆశాలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా కాలంలో ఆశాల శ్రమను గుర్తించి డబ్ల్యూహెచ్ఓ గ్లోబల్ లీడర్స్ అని ఆశాలకు అవార్డును ప్రకటించిందని, కానీ మన కేంద్ర ప్రభుత్వం నేటికీ ఆశాల శ్రమను గుర్తించకపోవడం సిగ్గుచేటు అన్నారు. పైగా ఎన్‌హెచ్ఎం స్కీంకు బడ్జెట్‌ను తగ్గిస్తున్నదని ఆరోపించారు. 19 సంవత్సరాల నుండి పని చేస్తున్న ఆశాలకు అత్యంత దుర్మార్గంగా కేవలం రూ.3,000లు మాత్రమే పారితోషికాలు చెల్లిస్తున్నారన్నారు. పారితోషికాల పద్ధతిని రద్దు చేసి పెరిగిన ధరలకనుగుణంగా ఆశాలకు కనీస వేతనం నిర్ణయించాల్సిన అవసరం ఉన్న, కేంద్ర ప్రభుత్వం ఇది మా బాధ్యత కాదని బాధ్యతారహితంగా వ్యవరిస్తున్నదనీ ఎద్దేవా చేశారు. ఇప్పుడు 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్‌ను తెచ్చిందన్నారు. సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు లేకుండా చేసి కార్మిక హక్కులను కాలరాసే విధంగా నిర్ణయం చేసిందన్నారు. మోడీ ప్రభుత్వం ఇప్పటికి కేంద్రంలో మూడుసార్లు అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఆయుష్మాన్ భారత్ పేరుతో వైద్య రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటుందన్నారు. కానీ ఆరోగ్య రంగంలో కీలక పాత్ర వహిస్తున్న ఆశాలను వర్కర్లుగా గుర్తించకపోవడం సిగ్గుచేటన్నారు. కాగా కనీస వేతనం ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయించుకుంటున్నారనీ మండిపడ్డారు. ప్రపంచ దేశాలని మూడో స్థానంలో మన దేశం ఉందని గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ ప్రభుత్వం కనీసం ఆశా వర్కర్లకు వేతనాలు ఇవ్వకపోవడం విడ్డూరమన్నారు. రూ.50 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టామని గొప్పలు చెప్పడమే తప్ప వాటిని కార్మికులకు కర్షకులకు ఖర్చు పెట్టకుండా కార్పొరేట్లకు ఇస్తుందని మండిపడ్డారు. 2016లో వివిధ వస్తువుల కొనుగోలుపై వేసిన పన్నులలో రాష్ట్ర వాట ఉండేదని ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పేరుతో పన్నులను స్వాహా చేస్తుందన్నారు. దీంతో రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆశాలను చిన్నచూపు చూస్తుందని ఆరోపించారు. వైద్య రంగపరంగా సర్వేల పేరుతో వెట్టి చాకిరి చేయిస్తుందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లు ఆశా వర్కర్లకు హామీలు ఇచ్చి నెరవేర్చలేదన్నారు.106 రోజులు సమ్మె చేస్తే రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి చర్చలు జరిపిన ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని వేతనాలు పెంచుతామని మేనిఫెస్టోలో పొందుపరిచి హామీ ఇచ్చారని తెలిపారు. కానీ ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోయిందని మండిపడ్డారు. హక్కులు సాధన అయ్యేవరకు ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆశ వర్కర్ల బస్సు జాతాను ప్రారంభించామన్నారు. డిసెంబర్ 31న ఇందిర పార్కు ముగింపు కార్యక్రమం ఉంటుందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాలు పర్యటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్వీ రమ, కోశాధికారి వంగూరు రాములు, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి నీలాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా నాయకులు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



నిర్మల్‌లో బస్ జాతను ప్రారంభిస్తున్న సాయిబాబు

**ఆశాల శ్రమను గుర్తించని ప్రభుత్వాలు : పాలడుగు భాస్కర్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాల శ్రమను గుర్తించలేదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. బహిరంగ సభలో మాట్లాడుతూ దేశంలోని అనేక పనులను ఆశలతో రాష్ట్ర ప్రభుత్వం చేపిస్తుందన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు సబ్ సెంటర్ డ్యూటీలు, బీపీ, షుగర్ టెస్టులు చేయడం, టిఎడిఎల్ ఇవ్వకపోవడం, ఎక్సమ్ డ్యూటీలు ఇతర అనేక సమస్యలు డబ్బులు లేకుండా ఆశలతో పనులు చేయించారన్నారు. దీనివల్ల చేసిన పనికి ప్రతిఫలం లేనందున ఆశల ఆర్థిక నష్టపోవడంతో పాటు త్రివేమైనా పని భారం పెరిగి ఆశల జీవితాలు కూనరిల్లుతున్నాయి. ఆశలు చేస్తున్న పనులన్నిటికీ పరిగణలోకి తీసుకోవాలని పెరిగిన ధరలకు అనుకూలంగా పారిదోష్కారం రూ .18 వేలకు పెంచి ఫిక్స్ వేతనం నిర్ణయించాలని అన్నారు. గత ప్రభుత్వం కాలంలో సమ్మె చేసిన సందర్భంగా ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టో ఆశ ఆశలకి ఇచ్చిన హామీలు 24 ఫిబ్రవరి 9న జులై 30న ఆరోగ్య శాఖ కమిషనర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పరిష్కరించకపోతే సమరసిరా పోరాటాలు నిర్వహిస్తామని, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆశల సమస్యలు పరిష్కరించే వరకు సిఐటియు నిర్విరామైన పోరాటాలు చేస్తుందని తెలిపారు.

**ఆశాలకు నిర్ణీత వేతనం ఇచ్చే వరకు పోరాటం**

**ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి..**

**ఆదిలాబాద్‌టౌన్ :** గ్రామీణుల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్న ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం రూ.18వేలు నిర్ణీత వేతనం ప్రకటించాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం ఆశా వర్కర్ల రాష్ట్ర బస్ జాత ఆదిలాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యాలయంలో బృందం సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశా వర్కర్ల సమస్య త్వరగా పరిష్కారం కావాలంటే ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకే ఈ బస్ జాతను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనేక పోరాటాలు చేసినా నిర్ణీత వేతనం అమలు కాలేదని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిర్ణీత వేతనం చెల్లిస్తామని హామీనిచ్చారని, మేనిఫెస్టోలోనూ పెట్టారని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఆశా, అంగన్వాడీలను మోసం చేయడంతోనే ఓడిపోయిందని, ఈ ప్రభుత్వం సైతం అలాగే వ్యవహరిస్తే పుట్టగతులు లేకుండా పోతుందని మండిపడ్డారు. వెంటనే హర్యాన, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ మాదిరి ఆశా వర్కర్లకు రూ.18వేల నిర్ణీత వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రకటించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 30వేల మంది ఆశా వర్కర్లను ఇబ్బందులకు గురిచేయడం తగదని, ప్రభుత్వం వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నీలాదేవీ, కోశాధికారి గంగామణి, బృంద సభ్యులు సునీత, సాధన, బాలమణి, సంఘం జిల్లా అధ్యక్షురాలు నైతం శోభ, కార్యదర్శి ఎం.సుజాత, కార్యదర్శి ఎం.సుజాత, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, కోశాధికారి సునీత, ఉపాధ్యక్షురాలు డి.వెంకటమ్మ, నాయకులు డి.సునీత, ఆశా యూనియన్ నాయకులు లక్ష్మీ, సంగీత, పుష్ప పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో మాట్లాడుతున్న జయలక్ష్మి

## బాబా చూపిన మార్గములో నడవాలి

- ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పులాజీబాబా చూపిన మంచి నడవడికలో పయనించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని అంజి గ్రామంలో నిర్వహించిన 35వ సిద్ధేశ్వరస్వస్థాన వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆయన నూతనంగా నిర్మించిన ఆలయములో ప్రత్యేక పూజ చేసి, పులాజీ బాబా చిత్రపటానికి పూల మాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంద్ ఆదివాసీ గురువు బాబా సమాజానికి మంచి బాటను చూపారన్నారు. ప్రతి ఒక్కరు మద్యం, మాంసం వంటి దురాలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారన్నారు. సన్మార్గంలో నడిచినందునే అంజి గ్రామంలో ఇంత పెద్ద మందిరం నిర్మించడం సాధ్యమైందన్నారు. అనంతరం సహపంక్తి భోజనం నిర్వహించారు. ఈ కార్యక్రమములో రాష్ట్ర మహిళా సంఘం కమిటీ చైర్మన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరి బాయి, కేశవ్ ఇంగలే, ముఖాడే విష్ణు, ఉత్తం, రాందాస్, కైలాస్ పాల్గొన్నారు.

## అమ్మవారికి డీసీసీ అధ్యక్షుడి పూజలు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పట్టణంలోని బంగల్‌పేట్ వెలసిన మహాలక్ష్మి అమ్మవారిని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్ దర్శించుకున్నారు. ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. వీరి వెంట మార్కెట్ కమిటీ ఛైర్మన్ భీమ్ రెడ్డి, రాజేశ్వర్, నాందేడపు చిన్ను ఉన్నారు.

## బూత్ కమిటీలే పట్టు కొమ్మలు

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

బూత్ కమిటీలే పార్టీకి పట్టుకొమ్మలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ఆదివారం ఎస్.ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీలో నిర్వహించిన మండలంలోని ఇలేగాం గ్రామంలో 159వ బూత్ కమిటీ కమిటీ ఎన్నిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎన్నికలకు ప్రారంభించారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన కాత్రే మాధవరావ్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ హయంలో చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని, గ్రామ గ్రామాన ఈమారు కాషాయ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎన్నికల సహ ఇంచార్జి రవి పాండే, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సర్డా, నియోజకవర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్, జిల్లా సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్ సిరం సుష్మ రెడ్డి, మండల అధ్యక్షులు భూమేష్, ప్రధాన కార్యదర్శి బండారి అశోక్, నాయకులు మాజీ ఎంపీటీసీ సుభాష్, సుధాకర్, రాజేశ్వర్, మధుకర్, కొండిబా, ప్రవీణ్, మహేష్ ఉన్నారు.

## ఫాలోయింగ్ చూసే పార్టీలో చేరిక



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని బుద్దికొండ గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన యువకులు లవ కుమార్ రెడ్డి (లడ్డు) ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ సమక్షంలో 20 మంది యూత్ సభ్యులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ యూత్ ఫాలోయింగ్ చూసే పార్టీలో చేరామని అన్నారు. యువకులు రాజకీయాల్లో రావాలని దేశభవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-బేల

శ్రీకృష్ణ ఆసుపత్రి (ఆదిలాబాద్) వైద్యులు డాక్టర్ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని చప్రాల గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 350 మంది గ్రామస్తులు ఈ వైద్య శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, షుగర్, ఇతర టెస్టులు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో దంత వైద్యులు డాక్టర్ రాహుల్, వైద్యులు డాక్టర్ రజిత క్రాంతి, డాక్టర్ కాలేష్, సిబ్బంది కళ్యాణి విజయ్ పాల్గొన్నారు.

# పోరాటాల ఫలితమే బదిలీలు..పదోన్నతులు

- సమస్యల పరిష్కారంలో టీఎస్‌యూటీఎఫ్‌ది కీలకపాత్ర
- ప్రభుత్వం పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి
- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య
- ఘనంగా ముగిసిన టీఎస్‌యూటీఎఫ్ ఆరో మహాసభలు




నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ టౌన్

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం టీఎస్ యూటీఎఫ్ అలుపెరుగని పోరాటం సాగిస్తోందని.. వాటి ఫలితంగానే ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపట్టిందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. పెండింగ్ బిల్లులను ప్రభుత్వం జాప్యం చేయకుండా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డా.బీ.ఆర్.అంబేడ్కర్ భవనంలో ఆదివారం టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఆరో మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమ పతాకాన్ని సంఘం పూర్వ బాధ్యులు, విశ్రాంత సీనియర్ ఉపాధ్యాయుడు దయాకర్‌రెడ్డి, ఆవిష్కరించగా.. ఎస్‌టీఎఫ్‌ఐ జెండాను విశ్రాంత ఉపాధ్యాయుడు జగన్మోహన్ ఎగురవేశారు. అనంతరం సంఘం గీతాన్ని ఆలపించి మహాసభలను ప్రారంభించారు. తొలుత అమరులైన సంఘం బాధ్యులు ఎం.కె.దత్, బక్కన్న చిత్రపటాలకు నివాళులర్పించి మౌనం పాటించారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడారు. దేశంలో 80శాతం అక్షరాస్యత పెరిగిందని చెబుతున్నారని.. కానీ కేవలం పేర్లు రాసే వారే కాకుండా వంద శాతం విద్యావంతులు కావాలని అప్పుడే సమాజ వికాసానికి దోహదం చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలోనూ విద్యావ్యవస్థలో అనేక ఖాళీలు ఉన్నాయని సర్కారు బడుల పర్యవేక్షణ కొరవడుతుందని చెప్పారు. అన్ని జిల్లాలకు రెగ్యులర్ డీఈఓలను నియమించడమే కాకుండా డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని స్పష్టం చేశారు. ప్రయివేటును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం సర్కారు విద్యను నిర్వీర్యం చేసేందుకు పూనుకుంటోందని తెలిపారు. ప్రభుత్వం సర్కారు బడుల పట్ల చిత్తశుద్ధిని కనబరిస్తేనే బడులు బాగుపడుతాయని ఉదహరించారు. ఐదు డీఏల్లో ఒకటి మాత్రమే ఇచ్చిందని.. పీఆర్సీ రిపోర్టు తెప్పించుకొని ప్రకటించాలని, పిల్లల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు సైతం విద్యార్థుల్లో సామాజిక స్పృహ కలిగేలా బోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.సాయిలు, రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.స్వామి, వి.అశోక్, రాష్ట్ర కమిటీ సభ్యులు సి.లక్ష్మణ్‌రావు, ఏ.సురేఖ, జిల్లా ఉపాధ్యక్షులు టి.సూర్యకుమార్, జిల్లా కోశాధికారి కె.కిష్టన్న, జిల్లా కార్యదర్శులు, వివిధ మండలాల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



**పలు తీర్మాణాలకు ఆమోదం..!**

జిల్లా మహాసభల సందర్భంగా సంఘం పలు తీర్మాణాలు ఆమోదించింది. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయడంతో పాటు పీఆర్సీని వెంటనే అమలు చేయాలి. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, అన్ని మేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులందరికీ ఆరోగ్యకార్డులు అందజేయాలని, కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర ఉద్యోగులకు ఎంటీఎస్ ఇవ్వడంతో పాటు వారిని రెగ్యూలర్ చేయాలి. గురుకుల పాఠశాలల టైం టేబుల్ మార్చాలని, గురుకుల ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాలు అందించాలి. గిరిజన సంక్షేమశాఖలో పండిత్, పీఈటీ పోస్టులను ఉన్నతీకరించాలి. విద్యారంగం అభివృద్ధికి సైతం మహాసభ పలు తీర్మాణాలు ఆమోదించింది. తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించి విద్యారంగానికి నిధులు పెంచాలి. మధ్యాహ్న భోజనం రేట్లను పెంచాలని, ప్రాథమిక స్థాయిలో విద్యార్థికి రూ.10, ఉన్నత స్థాయిలో రూ.15చొప్పున చెల్లించాలి. పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలి. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయింపునివ్వాలి. బడుల్లో ఖాళీలు భర్తీ చేసేలా ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించాలని సంఘం తీర్మాణించింది.

## ఉత్సాహంగా చెకుముకి సంబరాలు

- రిమ్స్‌లోని మ్యూజియం సందర్శన
- సాయంత్రం కార్నివాల్, స్టాళ్ల ఏర్పాటు




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మంత్రాలేమి లేవని సైన్స్ మాత్రమే ఉందని భావించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. సంబరాల్లో భాగంగా ఆదివారం రాత్రి పట్టణంలోని ఎన్టీఆర్‌చౌక్‌లో సైన్స్ కార్నివాల్ నిర్వహించారు. అంతకు ముందు వివిధ జిల్లాల నుండి వచ్చిన విద్యార్థులను ఫీల్డ్ టీంలో భాగంగా ఉదయం రిమ్స్‌ను సందర్శించారు. రిమ్స్‌లో గల మానవ అవయవాలతో కూడిన మ్యూజియంను పరిశీలించారు. సంబంధిత డాక్టర్స్ వాటిని గురించి విద్యార్థులకు వివరించారు. టీటీడీసీలో పద్మశ్రీ ఆవార్డు గ్రహిత దాసరి ప్రసాద్ రావు గుండెకు సంబందించిన సమస్యల గురించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

**లక్ష్యాన్ని చేరేందుకు చదువే ముఖ్యం**

ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. మన దేశస్తులు ఇతర దేశాలకు వెళ్లి ఏముందో తెలుసుకుంటారని అలాగే మన దేశంలో, రాష్ట్రంలో, జిల్లాలో ఏముందో నేర్చుకోవాలన్నారు. ఈ మధ్య పిల్లలకు సైన్స్ రుచి తగ్గుతుందని మొబైల్ వాడకం ఎక్కువ అవుతుందన్నారు. మనం ఎంచుకున్న లక్ష్యానికి చేరుకోవడానికి చదువు చాలా ముఖ్యమన్నారు. చదువుతోనే అన్ని సాధ్యమని వివరించారు. ఎన్ని ఆటంకాలు ఎదురైన చదువును మాత్రం ఆపొద్దన్నారు. సైన్స్‌ను అర్థం చేసుకొని ముందుకి సాగాలని పేర్కొన్నారు. మన భవిష్యత్‌ను సైన్స్‌తోనే మాడల్‌గా తయారు చేసుకోవాలని అన్నారు.

**సైన్స్‌తో జ్ఞానం లభిస్తుంది**

మాజీమంత్రి జోగురామన్న మాట్లాడుతూ.. అక్షరక్రమంలో ఆదిలాబాద్ జిల్లా పేరు ముందున్న అక్షరభ్యాసంలో వెనుక ఉన్నామని అన్నారు. కానీ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ చెకుముకి సంబరాలతో విద్యార్థులు ఎంతో జ్ఞానం పొందుతారని అన్నారు. రాష్ట్రస్థాయి సంబరాలను జిల్లా కేంద్రంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. సైన్స్‌ను విద్యార్థులు అర్థం చేసుకొని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, పద్మశ్రీ ఆవార్డు గ్రహిత ప్రసాద్ రావు, చిఫ్ సైంటిస్ట్ రాధ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ, రాష్ట్ర నాయకులు రవీందర్, జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శి ఉమాకాంత్, పెంటపర్తి ఊశన్న, శ్రీధర్ బాబు, నాగరాజు, సంతోష్ పాల్గొన్నారు.

## పెన్షనర్స్ డే విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెన్షనర్స్ డే సందర్భంగా ఈనెల 17న పట్టణంలోని సెంట్రల్ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి విశ్రాంత ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పెన్షనర్ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశం




నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్క విశ్రాంత ఉద్యోగి పాల్గొని, వేడుకలను విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగా పలువురి విశ్రాంత ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, బోజారెడ్డి, పట్టణ కార్యదర్శి అశోక్, జిల్లా కోశాధికారి నరేందర్, పట్టణ అధ్యక్షుడు సుధీర్, లింగయ్య పాల్గొన్నారు.

## కండ్లకు గంతలు కట్టుకొని నిరసన

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె నేటికి ఆరో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా ఉద్యోగులు కండ్లకు గంతలు కట్టుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దీక్ష శిబిరానికి వచ్చిన సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఉపాధ్యక్షులు రాములు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



## గ్రూప్-2 పరీక్ష కేంద్రాల తనిఖీ



నవతెలంగాణ-నిర్మల్

గ్రూప్-2 పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని దీక్ష, వశిష్ఠ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఆదివారం ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షకు జిల్లాలో మొత్తం 8,080 మంది అభ్యర్థులకు గాను, 4,146 మంది హాజరు కాగా, 3,934 మంది గైర్హాజరయ్యారు. ఆది, సోమవారాలలో ఉదయం, మధ్యాహ్నం చొప్పున మొత్తం నాలుగు సెషన్లలో జరిగే గ్రూప్-2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. కలెక్టర్ వెంట రీజినల్ కోఆర్డినేటర్ పీజీ రెడ్డి, పర్యవేక్షణ అధికారులు శ్రీనివాస్, గోపాల్, రవికుమార్, తహసీల్దార్లు రాజు, సంతోష్ పాల్గొన్నారు.

## క్రీడా నైపుణ్యాన్ని మెరుగుపర్చుకొని ఉన్నతంగా ఎదగాలి

- మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

క్రీడాకారులు తమకు ఆసక్తి కలిగిన క్రీడల్లో నైపుణ్యాలను మెరుగుపర్చుకొని ఉన్నతంగా ఎదగాలని, వారికి అన్ని విధాలా అండగా నిలబడతామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం ఖండాల గ్రామంలో ఆదివారం జోగు ఫౌండేషన్ అధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా అతిథులకు నిర్వాహకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కలిసి సరదాగా క్రికెట్ ఆడుతూ ఉత్సాహపరిచారు. అంతకుముందు గ్రామంలోని దత్తాత్రేయుడి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి క్రీడా పోటీలు దోహదం చేస్తాయన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ధృడత్వం పెరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను తమ వంతుగా ప్రోత్సహిస్తూ వారి ఎదుగుదలకు అండగా నిలుస్తున్నట్టు పేర్కొన్నారు. ఇలాంటి క్రీడాలా ద్వారా ఆటల సామర్థ్యాన్ని మెరుగు పరుచుకుంటూ, ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేష్, సెవ్వ జగదీష్, కుమ్ర రాజు, పరమేశ్వర్, కనక రమణ, మోతీరాం, జంగు బాపు, అశోక్, ప్రకాష్, సోము పటేల్, వివిధ గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

## వైభవోపేతంగా అష్టాదశ మహా పడిపూజ



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజుర జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణలో ఆదివారం అయ్యప్ప స్వామి అష్టాదశ మహా పడిపూజ వైభవోపేతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుబ్బారావు గురుస్వామి ఆర్మూర్ వాస్తవ్యులు హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు అయ్యప్ప మాల స్వీకరించిన సందర్భంగా మహాపడి పూజను నిర్వహించారు. ఈ మహోత్సవంలో సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యంలో అభిషేకంతో పాటు, ప్రత్యేక పూజలు చేశారు. స్వాముల నృత్యాలు, భజనలు ఆకట్టుకున్నాయి. అనంతరం 18వ సారి దీక్ష తీసుకున్న నారికేళ స్వాముల చిన్న దేవన్నరెడ్డి, గంగాధర్, శ్రీధర్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండల గురు స్వాములు పాల్గొన్నారు.

## బూత్ కమిటీ అధ్యక్షుల నియామకం

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని ఇందిరానగర్, శివాజీనగర్‌లలో ఆదివారం బూత్ కమిటీ అధ్యక్షుల నియామకం ఏకగ్రీవంగా జరిగింది. ఇంద్రనగర్ బూత్ నెంబర్ 235 బూత్ అధ్యక్షునిగా కొండవేని సంతోష్, కార్యదర్శిగా మెంగు ప్రకాష్‌లు, శివాజీ నగర్ బూత్ నెంబర్ 241 బూత్ అధ్యక్షునిగా గోడపురం సందీప్ కార్యదర్శిగా దుర్గి అజయ్ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ సహ కో ఆర్డినేటర్ ఆకుల శ్రీనివాస్, మండలాధ్యక్షులు నాయిని సంతోష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అంజు కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అబద్దపు హామీలు ఇచ్చి ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చిందని అన్నారు. అమలు కాని హామీలతో కాలయాపన చేస్తుందని రాబోయే రోజుల్లో సంస్థాగతంగా బూత్, మండల కమిటీలు పూర్తి చేసుకొని ఈ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టి ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు ఉద్యమ రూపంలో పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మధిరే శ్రీనివాస్, ప్రొద్దుటూరు గోపాల్‌రెడ్డి, ముత్యపు రాధ, పట్టణ ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాస్, నాగరాజు, జీవన్, కన్నయ్య, భీమన్న, ఆమంద రాజు పాల్గొన్నారు.

# పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ చేసింది శూన్యం

- మండిపడ్డ కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ఖానాపూర్ ప్రాంతానికి ఒరగబెట్టిందేమీ లేదని కాంగ్రెస్ మండలాధ్యక్షులు, దొనికెని దయానంద్, మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం తీవ్రంగా విమర్శించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకుల తీరు చూస్తే ఉనికిని కాపాడుకోవడానికి తపిస్తున్నట్లుగా ఉందని అన్నారు. పట్టణంలో పార్కును ప్రారంభించిన మంత్రి సీతక్కను స్థాయిని మరిచి విమర్శిండం తగదన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు పట్టణంలో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ కోసం రూ.25 కోట్లు నిధులు మంజూరు అయినట్లు అబద్ధపు ప్రకటనతో లబ్ధి పొందింది మీరుకాదా అని ప్రశ్నించారు. అలా మూడు దఫాలుగా అప్పటి ముఖ్యమంత్రి చేసిన ప్రకటన ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదని గుర్తుచేశారు. గోదావరి నదీ తీరంలో శ్మశాన వాటికను ప్రజలు వ్యతిరేఖించినా అంతా మా ఇష్టమే అన్నట్లుగా కూలిపోయిన పాత ఇండ్ల మట్టిని నింపి అక్రమంగా బిల్లులు కాజేయలేదా అని ప్రశ్నించారు. చిన్న పాటి వరదకే శ్మశాన వాటిక కూలిపోయి నిరూపయోగంగా మారిన విషయం ప్రజలకు తెలుసన్నారు. కోట్ల రూపాయలతో నిర్మించిన పసుపుల బ్రిడ్జి ఏడాది కాలంలోనే కూలిపోయిందన్నారు. ప్రారంభించి ఐదేండ్లు గడుస్తున్న పార్క్ నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడం బీఆర్ఎస్ నాయకుల చేతగాని తనానికి నిదర్శనమన్నారు. పట్టణంలో రోడ్డు వెడల్పు పనులను ముందుకు సాగనీయకండా స్టే తెచ్చి అడ్డుకుంటున్నారని అన్నారు. పట్టణంలో పేదలకోసం 110 ఎకరాల స్థల సేకరణ, రాజీవ్‌నగర్, గాంధీనగర్, అశోక్ నగర్ ఇలా చెప్పుకుంటూ పోతే తమ కాంగ్రెస్ హాయంలోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందాయని వివరించారు. కడెం ప్రాజెక్టు మరమ్మతులు, గంగాపూర్ బ్రిడ్జికి నిధులు, సదర్‌మాట్ రహదారి, తర్లాపాడ్ బ్రిడ్జి తధితర వాటిని ఏడాది కాలంలోనే చేపట్టామని తెలిపారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ భజన బ్యాచ్ పబ్బం కోసం కాకుండా ప్రజలకు మేలు జరిగే సూచనలు చేయాలని తీవ్రంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నిమ్మల రమేష్, మాజిద్, కావలి సంతోష్, కదార్ల గటగ నర్సయ్య, తోట సత్యం, మడిగెల గంగాధర్, బాశెట్టి నర్సయ్య, పోలంపెల్లి చింటు పాల్గొన్నారు.

# పులి దాడుల్లో చనిపోతున్న పట్టించుకోని ప్రభుత్వం

- మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి జిల్లాలో పులి వరుస దాడుల్లో ప్రజలు, అమాయక ఆదివాసులు చనిపోతున్నారని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. బజార్‌హత్నూర్ మండలం డెడ్రా గ్రామానికి చెందిన భీమ్‌భాయి చిరుతదాడిలో గాయపడి రిమ్స్ చికిత్స పొందుతుంది. కాగా ఆదివారం ఆమెను బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించి వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అక్కడి ఆదిలాబాద్ కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ అజీజ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి రిమ్స్ చికిత్స పొందుతున్నారని తెలుసుకుని ఆయన్ను పరామర్శించారు. ఉమ్మడి జిల్లాలో పులుల సంచారం పెరిగిన ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు విఫలమయ్యారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. 15 రోజుల క్రితం కాగజ్ నగర్ డివిజన్‌లో మహిళపై దాడి చేసి పులి హతమార్చిందని, సిర్పూర్‌లో రైతుపై దాడి చేసిందన్నారు. ఈ ఘటనలు మరవకముందే బజార్‌హత్నూర్ మండలం డెడ్రాలో చిరుత దాడి చేసిందన్నారు. ప్రభుత్వం పరంగా నష్టపరిహారం కూడా సక్రమంగా అందించడం లేదని ఆరోపించారు. జనాలు చనిపోతున్నా దాడులు జరుగుతున్న అధికారులు కానీ, అధికార పార్టీ నాయకులు కానీ, అటవీ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కూడా పరామర్శించలేదని మండిపడ్డారు. పులుల నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. మాజీ మంత్రి వెంట రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ సాజిదొద్దిన్, నారాయణ, పరమేశ్వర్, రమేష్, జగదీష్ అన్నారు.

**కాంగ్రెస్ నాయకుల పరామర్శ....**

బజార్‌హత్నూర్ మండలం డెడ్రా గ్రామానికి చెందిన మహిళ భీమ్ బాయిపై చిరుతపులి దాడి చేయడంతో రిమ్స్‌లో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లి బాధితురాలికి ఆర్థిక సాయం అందేలా చూస్తానని సుగుణ తెలిపారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై జిల్లా అదనపు వైద్యాధికారి కుడిమెత మనోహర్‌ను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నలిమెల నవీన్‌రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

# అమ్మ నాన్నకు తోడుగా సమ్మెలో చిన్నారులు

- ఆరో రోజుకు చేరిన సమగ్ర ఉద్యోగుల సమ్మె



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె ఆదివారం ఆరో రోజు చేరుకుంది. ఆదివారం సెలవు దినం కావడంతో ఉద్యోగుల పిల్లలు టెంట్‌కు వచ్చి దినమంతా కూర్చొని మద్దతు తెలిపారు. సీఎం వెంటనే స్పందించి, న్యాయం చేయాలని చిన్నారులు కోరారు. ఈ సమ్మెలో పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం సమగ్ర శిక్షా ఉద్యోగుల పట్ల మరణంలో కూడా వివక్షత చూపడం చాలా బాధాకరమన్నారు. ఓ సినిమా తొక్కిసలాటలో చనిపోతే స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి శనివారం జరిగిన ప్రమాదంలో చనిపోయిన యాకయ్య మరణం పట్ల స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. కేజీబీవీ పీటీఐ ఉద్యోగి సరోజ, స్వప్న తమ జీతం రూ.7800 చెప్పుకోలేక సిగ్గుపడి, అబద్ధం చెప్పుకుంటున్నారని వాపోయారు.

**పలువురి సంఘీభావం...**

ఉద్యోగుల సమ్మెకు పలువురు ఆదివారం సంఘీభావం తెలిపి మద్దతుగా నిలిచారు. ఇందులో ఏంఈఓలు సోమయ్య, శ్రీనివాస్, శ్రీకాంత్, భూమారెడ్డి, పోశెట్టి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కుర్ర రమేష్, విజయలక్ష్మి సమ్మె శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. అలాగే వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, పార్థసారథి, కేశవ్, వెంకటి, శ్రీకాంత్, ప్రియాంక, నవీన, మమతా, భారతి, జ్యోతి, రాకేష్, సురేష్, భోజన్న, సురేందర్, పొచ్చన్న, సలీం, రమేష్, వెంకన్న, సోమన్న, చిరంజీవి ఉద్యోగులు పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని బంగారిగూడకు చెందిన కాంగ్రెస్ ముఖ్యకార్యకర్త అనక గంగారాం శనివారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆదివారం వారి నివాసానికి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీలో కీలకంగా పనిచేస్తూ పార్టీని ప్రాణంగా భావించి, సామాజికంగా పనిచేసిన వ్యక్తి గంగారాం అని అన్నారు. ఆయన అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో నాయకులు నలిమెల నవీన్, బండి నరసింహాచారి, సత్యనారాయణ, కార్యకర్తలు ఉన్నారు.

## ఉద్యోగులకు జర్నలిస్టులకు క్రీడా పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీఎం కప్ పోటీల్లో భాగంగా ప్రభుత్వశాఖ ఉద్యోగులకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వారికి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబరు 21న ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. వాలీబాల్, బ్యాడ్మింటన్ పరుగు, టగ్ ఆఫ్ వార్, చెస్ పోటీలను ఉంటాయని స్పష్టం చేశారు. ఈనెల 20లోగా 6281966588 నెంబరును సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

## శబరిమల వెళ్లేందుకు లగ్జరి బస్సు ఏర్పాటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శబరిమల వెళ్లేందుకు అద్దె ప్రతిపాదికన ఆర్టీసీ ఆధ్వర్యంలో సూపర్ లగ్జరీ బస్సును ఇవ్వడం జరుగుతుందని ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. ఆదివారం పట్టణంలోని రవీంద్ర నగర్‌లో గల అయ్యప్ప స్వామి గుడిలో బిక్షా సమయంలో అయ్యప్ప స్వాములకు ఈ విషయం వివరించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. శబరిమల వెళ్లే స్వాములు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీసీ ప్రేమ్‌సింగ్, విలేజ్ బస్ ఆఫీసర్ సి.సతీష్ పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సోమవారం నిర్వహించే ప్రజావాణి రద్దు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. 15, 16 తేదీలలో గ్రూప్-2 పరీక్షలు ఉన్నందున ప్రజావాణిని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు తెలిపారు.

## చిన్నారి ఆరోగ్యంపై ఆరా..



నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని జల్దా గ్రామానికి చెందిన అల్లెం రాములు కుమార్తె రమకుమారి బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న సభావత్ శ్రీనివాస్ విజయ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్నారికి వైద్య ఖర్చులకు రూ.50వేలు ఆర్థిక సాయం అందించిన విషయం పాఠకులకు విధితమే. కాగా శనివారం సాయంత్రం ట్రస్ట్ చైర్మెన్ సభావత్ శ్రీనివాస్ నాయక్ జల్దా గ్రామానికి వెళ్లి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించేందుకు తనవంతు సహాకారం అందిస్తానని, తనను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్, బాపూరావు, గంగన్న, లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-నేరడిగొండ

మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రఫుల్‌రెడ్డి సోదరుడి కుమారుడు అల్లూరి కార్తీక్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి తేజాపూర్‌లోని వారి నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్తీక్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నలిమెల నవీన్ రెడ్డి, మహమ్మద్ ఇర్ఫాన్, సునీల్ జాదవ్, విశాల్ పాల్గొన్నారు.

## ఘనంగా సుందర చైతన్యానంద జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్వామి సుందర చైతన్యానంద స్వామి 77వ జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ మురళీకృష్ణ ఆలయంలో సుందర సత్సంగ్ భక్తులు వేడుకలను ఘనంగా జరిపారు. గత మూడు రోజులుగా అఖండ నామ సంకీర్తన కార్యక్రమాన్ని భక్తి ప్రపత్తుల నడుమ నిర్వహించారు. ఆలయంలో శ్రీ కృష్ణుడికి ప్రత్యేక పూజలు చేసి, అఖండ నామ సంకీర్తన ప్రారంభించారు. ఆదివారం సంకీర్తన ముగింపు సందర్భంగా శ్రీ కృష్ణ భగవానుడికి ప్రత్యేక హారతులిచ్చారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సుందర సత్సంగ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కోలాహల వాతావరణం నెలకొంది. సత్సంగ వక్త కృష్ణానంద, అధ్యక్షులు నర్సింగ్‌రెడ్డి భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో సుందర సత్సంగ సభ్యులు కొమ్రే భాశెట్టి, శివుడయ్యా, జయదేవ్, శివారెడ్డి, చిలుక దశరథ్, గంగాధర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా సాయిబాబా ఆలయ 24వ వార్షికోత్సవం

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని లింగి గ్రామంలోని షిరిడి సాయిబాబా ఆలయ 24వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన జంటలు యజ్ఞంలో పాల్గొని, వేద మంత్రాల మధ్య యజ్ఞం నిర్వహించారు. వివిధ మండలాలతో పాటు మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల ప్రజలు వార్షికోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, కేదారేశ్వర్‌రెడ్డి, తోట వెంకటేష్, బాబన్న, గ్రామస్తులు తోట ప్రమోద్, రెబతి అశోక్, నర్సింగ్, దెబ్బడి అశోక్, రవీందర్, గంగారాం, మహేందర్ పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు పరామర్శ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ సివిఎస్ రాజు మాతృమూర్తి దేవుబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, స్థానిక ధోబి కాలనీలోని వారి నివాసానికి చేరుకొని కమిషనర్‌ను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. దేవుబాయి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. పరామర్శించిన వారిలో నాయకులు నలిమెల నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.



3
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | డిసెంబర్ 16, 2024 | www.navatelangana.com

## నేటి ఐటీడీఏ ముట్టడికి తరలి రావాలి

నవతెలంగాణ-కెరమెరి



సమస్యల సాధన కోసం సోమవారం నిర్వహించే ఐటీడీఏ ముట్టడికి కొలవార్లు అధిక సంఖ్యలో తరలి రావాలని కోలాం సంఘం మండల అధ్యక్షుడు సిడాం ధర్మ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. మన్నెవార్లకు కొలవార్‌గా ధ్రువీకరణపత్రాలు జారీ చేయొద్దనే డిమాండుతో ఐటీడీఏ ముట్టడికి పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని కొలవార్లు ప్రతి గ్రామం నుండి అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సూరు ఉత్సవ కమిటీ చైర్మన్ మడావి రాజు, తుడుం దెబ్బ మండల అధ్యక్షులు సోము, రాజు, రఘునాథ్, జలపతి రావు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



అక్రమంగా ఆవులను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో అక్రమంగా 8 ఆవులను తరలిస్తున్న సమాచారం మేరకు అగర్ గూడ గ్రామ సమీపంలో పట్టుకొని వాటిని గోశాలకు తరలించామన్నారు. బొలెరో వాహనాన్ని సీజ్ చేసి అక్రమంగా ఆవులను తరలిస్తున్న మద్దెల గంగాధర్, షేక్ రహమత్, సయ్యద్ అబ్బులపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

## మొదటిరోజు గ్రూప్-2 పరీక్ష ప్రశాంతం

- సెంటర్లు తనిఖీ చేసిన కలెక్టర్, అదనపు కలెక్టర్
- జిల్లాలో 55 శాతం హాజరు నమోదు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష మొదటి రోజు ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 18 సెంటర్లు ఏర్పాటు చేయగా ఆసిఫాబాద్‌లో 9, కాగజ్ నగర్‌లో 9 సెంటర్లను ఏర్పాటు చేశారు. ఇందులో 4393 మంది పరీక్ష రాయాల్సి ఉండగా ఉదయం 2455 మంది పరీక్ష రాయగా 1938 గైర్హాజరు కాగా, మధ్యాహ్నం 2440 మంది పరీక్ష రాయగా 1953 మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్ వెంకటేష్ ధోత్రే జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలించగా, అదనపు కలెక్టర్ దీపక్ తివారి జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకుల వద్ద వివరాలు అడిగి తెలుసుకుని, పలు సూచనలు సలహాలు చేశారు. పకడ్బందీగా పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం మీద మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా అభ్యర్థులు సరైన సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు.

## టైగర్ కారిడార్ ప్రతిపాదన విరమించుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో టైగర్ కారిడార్ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీసీసీఎఫ్ ఇటీవల జిల్లాను సందర్శించినప్పుడు ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో టైగర్ కారిడార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని తెలియజేయడం అన్యాయమన్నారు. ప్రజలను గాని, ప్రజాప్రతినిధులను గాని సంప్రదించకుండా ఇలా ప్రతిపాదనలు చేసి ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తే ప్రతిఘటిస్తామన్నారు. తగు ప్రణాళికలు లేకుండా ఊర్లను తరలిస్తామని చెప్తున్నారని, ఈ విధానాన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తుందని, వెంటనే టైగర్ కారిడార్ ప్రతిపాదనను విరమించుకొని, పెద్దపులి వలన ఉత్పన్నం అవుతున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్ద ఎత్తున సీట్లు సాధించేలా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్, జిల్లా నాయకులు కొట్నాక విజయ్, బోనగిరి సతీష్ బాబు సతీష్, అరుణ్ లోయ, కృష్ణ కుమారి మల్లిక్, జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు శ్రీదేవి, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, సుదర్శన్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## సెమి క్రిస్టమస్

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో ఐఎంఐ ఇండియా మిషన్ చర్చ్ ఆధ్వర్యంలో ఆదివారం సెమి క్రిస్టమస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్ రవీందర్ సంఘ పెద్దలు రాజలింగు, ప్రభాకర్, లింగయ్య, దేవదాస్, జనార్ధన్ కేక్ కట్ చేసి సంబరాలను ప్రారంభించారు. ఏసు జనానికి సంబంధించి నాటికలను ప్రదర్శించారు.

## ఘనంగా ఉక్కుమనిషి వర్ధంతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉక్కు మనిషిగా పేరుపొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 75వ వర్ధంతి వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విశ్రాంత సంఘ భవనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కర్ణ గౌడ్ అధ్యక్షతన పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర సమయంలో హైదరాబాద్, జునాగడ్, కాశ్మీర్ లాంటి రాష్ట్రాలను దేశంలో విలీనం చేయడానికి పటేల్ చేసిన సాహసం భారత ప్రజలు ఎప్పటికీ మరువలేమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుర్రాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షురాలు అమలామేరి, మడిశెట్టి రాజేశ్వర్, కోమటిపెల్లి లింగయ్య, మార్కెటింగ్ వ్యాపారస్తులు వసంత్, సునీత పాల్గొన్నారు.

**బీజేపీ జిల్లా కార్యాలయంలో**

బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన వర్ధంతిలో జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కొంగ సత్యనారాయణ, నాగేశ్వరరావు, మల్లికార్జున్, విశాల్, మాటూరి జయరాజ్, విజయ్, సతీష్ బాబు, సొల్లు లక్ష్మి శ్రీదేవి, సుదర్శన్ గౌడ్ పాల్గొన్నారు.

# ఐటీడీఏ ఉన్నా..అభివృద్ధి సున్నా

- సమస్యల వలయంలో లైన్ పటార్
- పట్టించుకోని పాలకులు..ఇబ్బందుల్లో ఆదిమ గిరిజనం

**ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనుల కష్టాలు మాత్రం తీరడం లేదు. కనీస సౌకర్యాలు లేక నానా అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. ఓటు బ్యాంకుగానే వారిని వినియోగించుకుంటున్నారు తప్పా మౌలిక వసతుల కల్పనకు ఎవరూ తోడ్పడడం లేదు. దశాబ్దా లకాలంగా గిరిజన గ్రామాలు అభివృద్ధికి నోచుకోని దయనీయ పరిస్థితి నెలకొంది. ప్రతి ఏడాది గిరిజనుల అబివృద్ధి కోసం ఐటీడీఏ రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా ఇంకా ఆదివాసీ గూడేలు అభివృద్ధికి ఆమడ దూరంలో మగ్గుతున్నాయి. కనీసం వాహనాల రాకపోవడంతో మండలంలోని పలు గిరిజన గ్రామాల ప్రజలకు కాలినడకే శరణ్యమైంది. కనీస సౌకర్యాలు లేక సమస్యలతో సావాసం చేస్తున్న లైన్ పటార్ గ్రామంపై ప్రత్యేక కథనం...**









కర్ర ఇళ్లలలోనే జీవనం....ఇందిరమ్మ ఇళ్ళ కోసం ఎదురు చూపులు.

నవతెలంగాణ-కెరమెరి

బాహ్య ప్రపంచానికి దూరంగా విసిరేసినట్టుగా ఉన్న మండలంలోని లైన్ పటార్ గ్రామం దట్టమైన అడవుల్లో ఉంది. గ్రామం ఏర్పడి సుమారు 50ఏండ్లు కావస్తోంది. గ్రామంలో ఆదిమజాతికి చెందిన కోలాం తెగ గిరిజనులు నివసిస్తున్నారు. మండల కేంద్రానికి సుమారు 12కిమీ దూరంలో ఉన్న ఈ గ్రామంలో గతంలో 30 కుటుంబాలు నివసించేవి. ఏండ్లుగా సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో కొన్ని కుటుంబాలు ఇతర మండలాలకు తరలివెళ్లారు. ప్రస్తుతం 10 కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. పోడు వ్యవసాయం జీవనధారంగా బతుకుతున్న ఈ గ్రామప్రజలకు సంక్షేమ పథకాలు దరి చేరక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారు. అధికారులు పాలకులు ఈ గ్రామం వైపు కన్నెత్తి చూడకపోవడంతో నేటివరకు గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు.

**రాళ్లు రంపల మధ్యే నడక..**

గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గ్రామభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా మారింది. సరైన రోడ్డు సౌకర్యం లేక గిరి ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఆటోలు, ఇతర వాహనాలు గ్రామం వరకు రాలేని దుస్థితి. దీంతో నిత్యావసర సరుకులు, రేషన్ సరుకులు తలపై మోసుకెళ్ళక తప్పడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుండి టోకెన్ మోవాడ్ గ్రామం వరకు 10కిమీ వరకు తారు రోడ్డు సౌకర్యం ఉంది. అక్కడి నుంచే అసలు సమస్య మొదలవుతుంది. సుమారు 3కిమీ దూరం మేర లైన్ పటార్ వరకు దట్టమైన గుట్టల మధ్య కాలినడకన వెళ్ళాల్సిందే. దారి పొడవునా పెద్ద బండ రాళ్ల, రంపలు దాటుతూ గ్రామానికి చేరుకోవాల్సి వస్తుంది. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఆదివాసీ గ్రామాలు బాహ్య ప్రపంచానికి దూరమవుతున్నారు. వర్షాకాలం వారి బాదలు దేవుడెరుగు. అత్యావసర సమయాల్లో ప్రాణాలం అరచేతిలోపెట్టుకోవాల్సిందే. ఆ సమయంలో గర్భిణులు, చిన్నారులు విషసర్పాల బారిన పడినవారు అత్యావసర చికిత్సలు అందక చనిపోయిన సందర్భాలు కోకొల్లలు. రహదారి సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలకు రహదారి సౌకర్యంలేక నానా అవస్థలు పడుతున్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వాలు ప్రగల్భాలు పలుకుతున్నా దశాబ్దాలకాలంగా రహదారి సౌకర్యం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పదేండ్ల క్రితం గ్రామానికి మట్టి రోడ్డు మంజూరైన దారి పొడవునా కొద్ది పాటి ముళ్ల పొదలు, రాళ్లు తొలగించి, పూర్తి స్థాయిలో రోడ్డు పనులు చేపట్టకుండానే ఓ నాయకుడు నిధులు కాజేసినట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పట్టించుకునే వారు లేకపోవడంతో తమ సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలో తెలియక సమస్యలతో సావాసం చేస్తున్నారు ఆ గ్రామ ఆదిమగిరిజనం.

**కర్ర ఇళ్లలలోనే జీవనం....ఇందిరమ్మ ఇళ్ళ కోసం ఎదురు చూపులు.**

ప్రభుత్వాలు మారుతున్న పాలకులు మారుతున్నా కానీ ఆ గ్రామస్తుల తలరాతలు మారడం లేదు. ఎన్నో ఏండ్లుగా పక్క ఇండ్లు మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు. అయినా ఇంత వరకు వారి కల నెరవేరడం లేదు. ఆర్థిక స్తోమత ఏ మాత్రం లేని వారి జీవితంలో వెలుగులు రావడం లేదు. నేటికీ కర్రలతో చేసిన ఇండ్లలోనే దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. సంక్షేమ పథకాలు అమలుకు నోచుకోక గ్రామంలో అభివృద్ధి పనులు కానరావు. అంతర్గత రోడ్లు, డ్రైనేజి కాలువల నిర్మాణం నేటికీ చేపట్టలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుంది. ఇందిరమ్మ గృహల మంజూరులో ఎస్సీ, ఎస్టీల ప్రాధాన్యత కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తుండడంతో అదిమా గిరిజనులు ఇందిరమ్మ ఇళ్ళ కోసం ఎదురు చూస్తున్నారు.

### రోడ్డు సౌకర్యం కల్పించాలి

**ఆత్రం పావుగ, లైన్ పటార్**



యాభై ఏండ్లుగా లైన్ పటార్‌లో ఉంటున్నాం. గ్రామంలో మౌలిక సదుపాయాలు లేవు. ఒక చేతి పంపు ఉంది. అంతంత మాత్రమే పని చేస్తుంది. సౌకర్యాలు లేక కొన్ని కుటుంబాలు ఇతర గ్రామాలకు తరలి వెళ్లాయి. గ్రామంలో అంతర్గత రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలి. రోడ్డు సౌకర్యం లేక చాలా కష్టాలు పడుతున్నాం. తారు రోడ్డు సౌకర్యం కాల్పించాలి.

### లైన్ పటార్ సమస్యలు పరిష్కరించాలి

**సిడాం ధర్ము, కోలాం సంఘం మండల అధ్యక్షుడు**



ఏండ్లు గడుస్తున్న గ్రామ సమస్యలు పరిష్కారం కావడం లేదు. సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బదులు పడుతున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టలేదు. దీంతో శుద్ధ జలం అందక ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. పక్క ఇండ్లు లేక కర్ర ఇళ్లలో ఉంటున్నారు. ఈ ప్రభుత్వం అయినా లైన్ పటార్ ప్రజలకు పక్క ఇండ్లు, రోడ్డు సౌకర్యం కల్పించాలి.

## అటవీ భూములను కార్పొరేట్లకు అప్పగించే కుట్రలను సహించం

- సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్




నవతెలంగాణ-కాగజ్‌నగర్

పులుల సంరక్షణ పేరుతో అటవీ భూములను కార్పోరేట్లకు అప్పచెప్పే కుట్రలను సహించేది లేదని సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ భూములను స్వాధీనం చేసుకోవడం కోసం ప్రభుత్వాలు నానా రకాల పేర్లతో కుట్రలు పన్నుతున్నాయని అన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పెద్దపులులు సంచరిస్తున్నాయని, ఇక్కడ టైగర్ కారిడార్ ఏర్పాటు చేస్తే కేంద్రం నుండి నిధులు వస్తాయని అటవీ ఉన్నతాధికారులు ప్రకటనలు చేస్తూ రైతులను మభ్యపెడుతున్నారని అన్నారు. ఈ సాకుతో అడవులకు దగ్గరలో ఉన్న గ్రామాలను ఖాళీ చేయించి ఆ భూములను ప్రభుత్వాలు స్వాధీనం చేసుకొని కార్పోరేట్లకు అప్పగిస్తాయని ఆరోపించారు. జిల్లాలో ఇప్పటికే పులులు, ఏనుగు దాడిలో ఆరుగురు మృతి చెందారని, ఆ క్రూర మృగాలను ఇక్కడి నుండి తరలించడంలో అటవీ శాఖ వైఫల్యం చెందిందని విమర్శించారు. ఇప్పటికే పత్తి పంట తీయాల్సిన సమయం దాటిపోయిందని, పులుల భయంతో రైతులు పంట పొలాలకు కూడా వెళ్లక నష్టపోతున్నారని అన్నారు. టైగర్ కారిడార్ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పులి దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా, నష్టపోయిన పత్తి పంటకు ఎకరానికి రూ. 50 వేలు, ఐదెకరాల సాగు భూమి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందనళోలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం శ్రీనివాస్, ముంజం ఆనంద్‌కుమార్, నాయకులు ఊట్ల రవి పాల్గొన్నారు.

## గజ..గజ..

- జిల్లాలో తగ్గిన ఉష్ణోగ్రతలు
- బయటికి రావడానికి జంకుతున్న జనం





నవతెలంగాణ-ఆసిఫాబాద్

మూడు రోజుల క్రితానికి ఆదివారానికి జిల్లాలో ఉష్ణోగ్రతలు పూర్తిగా మారిపోయాయి. దీంతో జిల్లా ప్రజలు వణికిపోతున్నారు. రాష్ట్రస్థాయిలో అత్యల్ప ఉష్ణోగ్రతలు జిల్లా వ్యాప్తంగా నమోదవుతున్నాయి.

**తిర్యాణిలో అత్యల్ప ఉష్ణోగ్రతలు**

నాలుగు రోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గుతూ వస్తున్నాయి. ఆదివారం జిల్లాలోని తిర్యాణి మండల కేంద్రంలో 6.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, సిర్పూర్ (యు)లో 6.9 డిగ్రీలు, కెరమెరిలో 7.5 డిగ్రీలు, ధనోరా(కెరమెరి) 8.3 డిగ్రీలు, జంబుగ (కాగజ్‌నగర్)లో 8.6 డిగ్రీలు, గిన్నెదరి(తిర్యాణి)లో 9.1 కాగజ్‌నగర్ కేంద్రంలో 9.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇలానే మరో వారం రోజుల పాటు వాతావరణం ఉంటుందని వాతావారణ శాఖ అధికారులు చెబుతున్నారు.

**బయటకు రావడానికి జంకుతున్న జనం**

జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు తగ్గుతుండడంతో ప్రజలు చలితో ఇబ్బందులు పడుతున్నారు. చలిగాలులు వీస్తున్న నేపథ్యంలో మధ్యాహ్నం పూట కూడా ఏజెన్సీ ప్రాంతాల్లో బయటికి రావడానికి ప్రజలు జంకుతున్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన దుప్పట్లను అధికారులు అందజేసిన పూర్తిస్థాయిలో లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. సాయంత్రం కాగానే ఎక్కడికక్కడ ప్రజలు చలి మంటలు కాగుతున్నారు.

**జాగ్రత్తలు వహించాలంటున్న డాక్టర్లు..**

చలి తీవ్రత పెరగడం ఉష్ణోగ్రతలు పడిపోవడంతో అస్తమా, గుండె నొప్పులు, ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్న రోగులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గడంతో వీరి ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు వహించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏ పాటి నిర్లక్ష్యం వహించిన పెద్ద సమస్యగా మారుతుందన్నారు. శ్వాసకోశ వ్యాధితో బాధపడే వారు బయటకు రావాల్సిన ఇతర ప్రాంతానికి వెళ్లే సమయంలో మాస్కులు ధరించాలని, నీరు ఎక్కువగా తాగాలని సూచిస్తున్నారు.

## ఎండీఎం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్



నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం సంఘం మండల అధ్యక్షురాలు కాంతమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఓ పక్క బిల్లులు సకాలంలో అందక కార్మికులు అప్పులు చేసి పథకాన్ని నిర్వహిస్తూ అనేక ఆర్థిక, మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా పథకం సక్రమంగా నడవలేక పోవడానికి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. రాష్ట్రంలో పేద బడుగుబలహీన వర్గాల పేద విద్యార్థులకు, పౌష్టికాహారంతో పాటు మంచి భోజనాన్ని అందిస్తున్న కార్మికుల పట్ల ఈ ప్రభుత్వం మంచి ఆలోచనతో గతంలో ఇచ్చిన హామీల మేరకు కార్మికులకు వేతనాలు పెంచడంతో పాటు పౌష్టికాహారం, నిత్యావసర వస్తువులు, గ్యాస్‌ను సరఫరా చేయాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నెలకు రూ.10వేలు చెల్లించాలని, కార్మికులకు సామాజిక ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. అంగన్‌వాడీలకు ఇస్తున్న విధంగా నిత్యావసర వస్తువులు మధ్యాహ్న భోజన పథకానికి ఇవ్వాలని కోరారు. హక్కుల సాధన కోసం ఈనెల 22వ తేదీన హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ మండల ఉపాధ్యక్షురాలు విజయ, లక్ష్మి, ప్రధాన కార్యదర్శి బుజ్జమ్మ, సహాయ కార్యదర్శి సతమ్మ కోశాధికారి ఆశక్క, కార్మికులు సురేఖ, శ్రీదేవి, యశోద, రమాదేవి, కార్మికులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
సోమవారం | డిసెంబర్ 16, 2024 | www.navatelangana.com

## బీసీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఆవిడపు గణేష్

నవతెలంగాణ-జైపూర్



బీసీ రాజ్యాధికార సమితి చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా శివ్వారం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ ఆవిడపు గణేష్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు ఒడ్డెపల్లి మనోహర్ నియామక పత్రం అందజేశారు. బీసీ కులాల సమస్యలపై పోరాటం చేస్తూ బీసీ కులాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. నియోజకవర్గ పరిధిలో గల మండలాలలో బీసీ కులాల వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యక్షంగా పోరాటం చేయడానికి ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపారు. బీసీ రాజ్యాధికార సమితి నియోజవకర్గం ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించిన జిల్లా రాష్ట్ర కమిటి బాధ్యులకు ఈ సంధర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## షెడ్యూల్ కులాల పరిరక్షణ ధ్యేయం

నవతెలంగాణ-జన్నారం

షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణే ధ్యేయం అని, తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల పరిరక్షణ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మగ్గిడి ప్రణవ్ అన్నారు. ఆదివారం, హైదరాబాదులో షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన ఆయనను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ బాబు నియామక పత్రాన్ని అందించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్ కులాలపై ఉన్నత వర్గాలు చేస్తున్న దాడులపై తన పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. షెడ్యూల్ కులాల వారికి అండగా నిలుస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన ప్రణవ్ కుమార్‌కు మండల మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ మాదాడి సరోజన రవీందర్‌రావు, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు సిటీమల భరత్ కుమార్, మాజీ కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, మాజీ వైస్ ఎంపీపీ వినయ్ కుమార్, సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు జాడి గంగాధర్ తెలిపారు.

# ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసుకోవాలి

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న మితనల్ ప్లాంట్ నిర్మాణ పనులు నెలాఖరులోగా పూర్తి చేసుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ సూచించారు. ఆదివారం ఎస్టీపీపీని సంధర్శించిన ఆయన ప్లాంట్ అధికారులతో సమావేశమయ్యారు. ప్లాంట్ పని తీరు విద్యుత్ ఉత్పత్తి తదితర విషయాలపై ఆరా తీసిన ఆయన మితనల్ ప్లాంట్ పనులు పూర్తి చేసి వెనువెంటనే ఉత్పత్తిని ప్రారంబించుకోవాలని తెలిపారు. ప్లాంట్ నుంచి వెలువడే కార్బన్డయాక్సైడ్‌ను హైడ్రోజన్‌తో మిలితం చేసి మితనల్‌ను తయారు చేసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ విధంగా తయారు చేసుకున్న మితనల్ పెయింట్స్, ఫర్టిలైజర్స్, ప్లాస్టిక్ వంటి వివిధ రకాలైన పరిశ్రమలకు అందించి సంస్థ ఆర్థికంగా లబ్దిపొందనున్నదని అన్నారు. ప్లాంట్ ఎగ్జిగ్యూటీవ్ డైరెక్టర్ రాజశేఖర్ రావు మాట్లాడుతూ సీఎండీ బలరామ్ దిశా నిర్దేశంతో సంస్థ మరింత అభివృద్ధి చెందుతుందని అదేవిధంగా థర్మల్ విద్యుత్ ప్లాంట్ ద్వార మంచి పీఎల్ఎఫ్ సాధిస్తూ దేశంలో అత్యుత్తమ ప్లాంట్‌గా గుర్తింపు పొందిందని అన్నారు. అదేవిధంగా సోలార్ విద్యుత్ ప్లాంట్ కూడ మంచి పని తీరు కనబర్చుతుందని, అదే క్రమంలో థర్మల్ ప్లాంట్‌తో పాటు సోలార్ ప్లాంట్లు వివిధ సంధర్భాల్లో అవార్డులు సొంతం చేసుకుంటున్న తీరును గుర్తు చేశారు.

● ఎస్టీపీపీ ఆవరణలో మొక్కలు నాటిన సీఎండీ బలరామ్



**మరోమారు మొక్కలు నాటిన సింగరేణి సీఎండీ**

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను సంధర్శించిన సీఎండీ ఎన్ బలరామ్ ఎస్టీపీపీ ఆవరణలో మరోమారు మొక్కలు నాటారు. స్వతహాగా ప్రకృతి ప్రేమికుడు అయినటువంటి సీఎండీ గతంలో అనేక సంధర్భాల్లో సింగరేణి వ్యాప్తంగా ఒంటి చేత్తో మొక్కలు నాటి ట్రీ మ్యాన్ ఆఫ్ తెలంగాణగా పిలువబడుతున్నాడు. ఈ సంధర్బంగా ఎస్టీపీపీ ఆవరణలో 209 మొక్కలు నాటిన ఆయన మొత్తంగా ఇప్పటి వరకు 18,500 మొక్కలు ఒంటి చేత్తో నాటినట్లు ప్రకటించారు. సింగరేణి కోల్ బెల్ట్ ఏరియాల్లో ఆయన నాటిన మొక్కలు సమూదాయాలు 35 మినీ ఫారెస్ట్‌ను తలపిస్తుండటం విశేషం.. అదేవిధంగా గతంలో ఆయన నాటిన మొక్కల ఎదుగుదలను పరిశీలించిన ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ, జీఎం పీసీఎస్ శ్రీనివాసులు, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ యోగేష్ పర్మార్, ఏజీఎం సివిల్ కేఎస్ఎన్ ప్రసాద్, డీజీఎం పంతుల, డీజీఎం ఎన్విరాన్మెంట్ వాసుదేవ మూర్తి, ఎస్ఓటూ ఈడీ ప్రభాకర్, డీజీఎం పర్సనల్ అజ్మీర తుకారాం పాల్గొన్నారు.



మందమర్రి లో..

**మందమర్రి :** సింగరేణి సీఎండీ బలరాం ఆదివారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ తో కలిసి కేకే ఓసీని సందర్శించారు. జీఎం దేవేందర్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్బంగా సీఎండీ మాట్లాడుతూ నిర్దేశించిన ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతి ఒక్కరూ సమిష్టి కృషి చేయాలని, ఎల్లప్పుడు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని సంబంధిత అధికారులకు తగు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సూర్యనారాయణ, కేకే ఓసీ ప్రాజెక్ట్ అధికారి మల్లయ్య పాల్గొన్నారు.

**నస్పూర్ :** శ్రీరాంపూర్ ఉపరితల గనిని ఆదివారం సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా గనిలోని పని ప్రదేశాలను, కోల్ బెంచ్‌లను ప్రత్యక్షంగా పరిశీలించారు. అలాగే గని ప్లాన్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఉపరితల గని శ్రీరాంపూర్ ఏరియాకు తలమానికమని, శ్రీరాంపూర్ ఏరియా నుంచి నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించడంలో గని ప్రముఖ పాత్ర వహిస్తుందని, ఇదేవిధంగా రాబోవు ఆర్థిక సంవత్సరంలో కూడా బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబి వెలికితీత లక్ష్యాలను సాధించాలని సూచించారు. శ్రీరాంపూర్ ఉపరితల గని 32 లక్షల వార్షిక నిర్దేశిత లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని అలాగే ఓబి కాంట్రాక్ట్ కంపెనీ వారు 330లక్షల క్యూబిక్ మీటర్ల నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకత సాధనగా సింగరేణి ముందుకు వెళ తుందని, ఈ ఒరవడి కొనసాగించాలని కోరారు. బొగ్గు అవసరం దృశ్య కొన్ని మార్పులను సూచిస్తూ అట్టి మార్పులకు అందరూ సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, గని మేనేజర్ బ్రహ్మాజీ, రక్షణాధికారి శ్రీనివాస్, సర్వ అధికారి సంపత్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి పాల్గొన్నారు.

నస్పూర్‌లో..



## సబ్సీడీ వరి విత్తనాలు పంపిణీకి సిద్ధం

● మండల వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్

నవతెలంగాణ-జైపూర్

రైతుల సౌకర్యార్థం యాసంగి పంట సాగుకు సంబంధించి సబ్సీడీ వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు స్థానిక వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్ తెలిపారు. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా జేజీఎల్-24423 రకం వరి విత్తనాలు 50 శాతం సబ్సీడీపై పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 25 కిలోల బస్తా సబ్సీడీ పోను రూ.500 చొప్పున పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 144 విత్తన బస్తాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపిన ఆయన అవసరమైన రైతులు మండల కేంద్రంలో గల రైతు వేధికలో సంప్రదించాలని తెలిపారు. సబ్సీడీ విత్తనాలు పొందాలనుకున్న రైతులు తమకు చెందిన ఆధార్‌కార్డు, పట్టాదార్ పాసుపుస్తకం జిరాక్స్ కాపీలు తమతో పాటు తీసుకురావాలని సూచించారు. పంట కాలం మొదలవుతున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-జైపూర్

రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలనని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం చెన్నూర్ మండలం కిష్టంపేట్, కత్తెరసాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సంధర్బంగా దాన్యం కొనుగోలు తీరును పరిశీలించిన ఆయన రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన సన్నరకం వరి దాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ అందజేస్తుందని తెలిపారు. జిల్లా పరిధిలో 326 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా 315 కొనుగోలు కేంద్రాల ద్వార రైతుల నుండి దాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ఏ గ్రేడ్ రకం రూ.2,320 సాధారణ రకం క్వింటాలుకు రూ.2,300 చొప్పున మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన దాన్యం తరలించాలని, తేమ శాతం, తాలు, మట్టి గడ్డలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల సౌకర్యార్థం తాగు నీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరుగుతుందని, అదేవిధంగా టార్పాలిన్లు, గన్ని సంచులు అవసరమైన మేరకు సమకూర్చనున్నట్లు తెలిపారు.

## ఘనంగా దత్తాత్రేయ జయంతి వేడుకలు

నవతెలంగాణ-నస్పూర్



మున్సిపాలిటి పరిధిలోని శ్రీరాంపూర్ అర్కే-8 కాలనీలోని శ్రీ గణపతి శిరిడి సాయిబాబా దేవాలయంలో ఆదివారం దత్తాత్రేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 కలశాలతో పాలాభిషేకం, లక్ష పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలకు వేలదిగా భక్తులు తరలివచ్చారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, సురేఖ దంపతుల సహకరంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ వేణు, మంచిర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, సంపత్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఏల్పుల రవీందర్, చిలుక మల్లేష్, పొట్లచెర్ల రాములు, బండి తిరుపతి, కౌన్సిలర్ కుమార్, స్వాములు సూరం మోహన్‌రెడ్డి స్వామి, రాజేందర్ స్వామి, రాకేష్ స్వామి పాల్గొన్నారు.

## గ్రూప్-2 పరీక్ష కేంద్రాల పరిశీలన



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో డిసెంబర్ 15, 16 తేదీలలో నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్ష కేంద్రాలను ఆదివారం కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌బీహెచ్‌వీ, కార్మల్ కాన్వెంట్‌లలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయసిట్టు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మొదటి రోజు పరీక్షకు 14 వేల 951 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా ఉదయం పరీక్షకు 7 వేల 446 మంది అభ్యర్థులు, సాయంత్రం పరీక్షకు 7 వేల 363 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రంలోనికి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, షఉలు అనుమతించడం జరగదని, అభ్యర్థులు పరీక్ష సమయానికి గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. ఉదయం పరీక్షకు 9:30 గంటలకు, మధ్యాహ్నం పరీక్షకు 2.30 గంటలకు గేట్లు మూసి వేయడం జరుగుతుందని, తదుపరి ఎవరిని అనుమతించడం జరగదని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని, కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణికి జాతీయ స్థాయిలో మరో అవార్డు

● 20న అవార్డు ప్రదానం చేయనున్న ఎనర్షియా పౌండేషన్

నవతెలంగాణ-జైపూర్

పర్యావరణహిత సుస్థిర మైనింగ్‌తో పాటు సంప్రదాయేతర విద్యుత్ రంగంలో విశేషమైన సేవలు అందిస్తున్న సింగరేణికి జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక అవార్డు దక్కింది. భారత దేశం, దక్షిణాసియాలో సుస్థిర ఇందన, పునరుద్పాదక ఇందన వనరులను ప్రోత్సహించడంలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చుతున్న సంస్థలను ఎనర్షియా పౌండేషన్ వారు ఎంపిక చేస్తూ ప్రతి ఏడాది పురస్కారాలను ప్రదానం చేస్తుంది. ఈ క్రమంలో ఇండియాస్ బెస్ట్ అండ్ మోస్ట్ సస్టేనబుల్ కోల్ మైనింగ్ ఆపరేటర్ విత్ రెన్యూవబుల్ ఎనర్జీ అడాప్షన్ కేటగిరిలో సింగరేణి సంస్థను అత్యుత్తమ సంస్థగా ఎంపిక చేశారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డును నెల 20న విషాఖపట్నంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి 17వ బహుమతి ప్రదానోత్సవ వేడుకల్లో సింగరేణి సంస్థకు అవార్డును ప్రదానం చేయనున్నారు. పర్యావరణానికి పెద్దపీట వేస్తూ సుస్థిర మైనింగ్‌ను విజయవంతంగా నిర్వహించటమే కాకుండా సంప్రదాయేతర ఇందన వనరుల్లో ఒకటైన సోలార్ విద్యుత్ ఉత్పాదనను చేపట్టి విజయవంతంగా ముందుకు తీసుకువెలుతున్న సింగరేణి సంస్థను ఈ రంగాల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ సంస్థగా అవార్డుల కమిటీ నిర్ణయించినట్లు ప్రకటించందని అవార్డుల కమిటీ జ్యూరీ కన్వీనర్ ఆర్ త్యాగరాజన్ అయ్యర్ ప్రకటించినట్లు తెలిపారు.

**పర్యావరణహిత చర్యలకు గుర్తింపు : సీఎండీ బలరామ్**

ఎనర్షియా వారు ప్రకటించిన జాతీయ స్థాయి అవార్డు సింగరేణి సంస్థ చేపడుతున్న పర్యావరణహిత చర్యలకు గుర్తింపు వంటిది. సింగరేణి సంస్థ ఈ స్పూర్తితో తన పర్యావరణ చర్యలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ముందుకు పోతుంది. ఎనర్షియా వారు జాతీయ స్థాయి అవార్డును ప్రకటించడం పట్ల సింగరేణి ఆనందంగా ఉంది.

## కాళేశ్వరం నీరు వాడకుండానే రికార్డ్ స్థాయిలో పంటలు

● ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



నవతెలంగాణ-మంచిర్యాల

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఒక్క లీటరు నీటిని ఉపయోగించ కుండానే నియోజకవర్గంలో ఒక కోటి 53 లక్షల టన్నుల వడ్లను పండించామని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల విదానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో రైతులు ఎంతో నష్ట పోయారనీ, ఒక్కొక్క బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రతి పథకంలో అవినీతికి పాల్పడ్డారన్నారు. బీఆర్ఎస్ నాయకులు పదేండ్ల కాలంలో రాష్ట్రాన్ని దోచుకున్నారనీ కాళేశ్వరం పేరుతో ఆర్థిక దోపిడీకి పాల్పడ్డారనీ విమర్శించారు. 16 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలను పెంచిందని తెలిపారు. రూ.2 లక్షల రుణమాఫీ 89 శాతం పూర్తి అయ్యిందనీ కొంత మంది రైతుల డాక్యుమెంట్స్ సరిగా లేకపోవడంతో రుణమాఫీ కాలేదని త్వరలోనే పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన అప్పులకు ఇప్పటివరకు రూ.62 వేల కోట్లు వడ్డీ చెల్లించామని తెలిపారు. బీజేపీ నాయకులు కొత్త బిచ్చగాళ్ల లాగా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక వ్యవసాయ రంగంపై రూ.54 వేల కోట్లు పెట్టుబడులు పెట్టి రైతులను ఆదుకున్నమని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందు పరిచిన ప్రతి అంశాన్ని అమలు చేస్తున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ కింద 155 మంది లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సురిమిళ్ళ వేణు, మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ సళ్ళ మహేష్ పాల్గొన్నారు.

## అన్ని వర్గాలకు అండగా ఉండేది కమ్యూనిస్టులు

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-మంచిర్యాల




అనగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడే వారే కమ్యూనిస్టులని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో ఏఐడీఆర్ఎం జాతీయ 2వ మహాసభల పోస్టర్ల విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళితులకు రిజర్వేషన్లు తీసివేసే కుట్రలు చేస్తుందని, దేశంలో వ్యవసాయ ఉత్పత్తులు ఎక్కువగా కూలీ పని చేసే దళితులపైన ఆధారపడి ఉందన్నారు. వ్యవసాయ కూలీలు రైతులతో పాటుగా ప్రభుత్వాలు దళితుల అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, నేటకి దళితులకు పరిమితంగానే విద్య ఉద్యోగ అవకాశాలు దొరుకుతున్నయన్నారు. ఒకప్పుడు ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా దళితులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు దొరికేవి కానీ బీజేపీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం దేశంలో అధికారంలోకి వచ్చాక ప్రయివేటీకరణ సరళీకరణ ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేయడంతో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుకరించడం ద్వారా దళితుల అభివృద్ధికి అడ్డంకిగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణను నిలిపివేసి ఆ రంగాల్లో రిజర్వేషన్ అమలుకు పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టాలని, దళితులు అభివృద్ధి చెందాలంటే ఎస్సీ సబ్ ప్లాన్ దేశవ్యాప్తంగా అమలు చేయాలని దళితుల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు పెంచాలని కోరారు. అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం హైదరాబాదులో జనవరి 5, 6, 7 తేదీలలో నిర్వహించే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామ డుగు లక్ష్మణ్, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, తాండ్ర సదానందం, మేకల దాస్, రేగుంట చంద్రశేఖర్, నాయకులు పొనగంటి ఏసేపు, దాసరి రవీందర్ పాల్గొన్నారు.

## ఒలింపియాడ్ టెస్ట్‌కు స్పందన

నవతెలంగాణ-మంచిర్యాల/లక్షెట్టిపేట



ఆల్ఫోర్స్ విద్యా సంస్థ ఆధ్వర్యంలో శ్రీనివాస రామనుజన్ స్మారకార్థం ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి. నరేందర్‌రెడ్డి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామానుజన్ చిన్నతనం నుండే గణిత శాస్త్రంపట్ల శ్రద్ధ చూపెడుతూ గణిత శాస్త్రంలో అనేక విషయాలను కనుగొని గణిత శాస్త్రానికి నూతన అధ్యాయాన్ని రచించారని తెలిపారు. ప్రతి విద్యార్థి రామానుజన్ వలే కృషిచేసి వారి మార్గాన్ని అనుసరించి గణితంలో అద్భుతాలు సృష్టించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. జిల్లా కేంద్రంతో పాటు లక్షెట్టిపేట్, చెన్నూరులలో నిర్వహించిన ఈ పరీక్షలో సుమారు 1840 మంది విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను చాటారు. పరీక్షా పోటీలో వివిధ పాఠశాలల యజమాన్యాలు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

## ఐక్యంగా ఉంటేనే హక్కుల సాధన సాధ్యం

● పోస్టల్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్




నవతెలంగాణ-మంచిర్యాల

ఐక్యంగా ఉండి మన హక్కులను సాధించుకుందామని, ఉద్యోగులమంత ఏకమై పోస్టల్ ఉద్యోగుల సమస్యలుపై అధికారులకు తెలిసేలా చేయాలని పోస్టల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తాండ్ర పాపరాయుడు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం, అదిలాబాద్ డివిజన్, మంచిర్యాల బ్రాంచ్ 35వ ద్వైవార్షిక మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో తపాలా శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలు తీర్మానాలు ప్రవేశ పెట్టారు. అందులో వెంటనే 8వ పే కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ నిలిపివేయాలని, గ్రామీణ తపాలా ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి తపాలా శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పలు అంశాలతో తీర్మానాలు చేశారు. పోస్టల్ ఉద్యోగుల డిమాండ్‌లను వెంటనే అమలు పరిచేలా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో పోస్టల్ ఉద్యోగ సంఘాల రాష్ట్ర కార్యదర్శి శ్రావణ్ కుమార్, పోస్ట్ మ్యాన్ సంఘ కార్యదర్శి మధుసూదన్, జీడీఎస్ సంఘం కార్యదర్శి బండి జయరాజు ఉమ్మడి ఉద్యోగ సంఘాల సమన్వయ కన్వీనర్ రంగు రాజేశం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాష్ పాల్గొన్నారు.

## గుండి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని గుండి బ్రిడ్జి త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్టు డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. ఆదివారం నాయకులతో కలిసి బ్రిడ్జి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండి గ్రామ ప్రజల కల నెరవేరే రోజు తొందర్లోనే ఉందన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో అతివేగంగా గుండి బ్రిడ్జి పనులు నడుస్తున్నాయని, వర్షాకాలం లోపు గుండి బ్రిడ్జి పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చరణ్, గుండి మాజీ సర్పంచ్ సెండే దత్తు, మాజీ ఎంపీటీసీ గాదవేణి మల్లేష్, నాయకులు దానపెల్లి శ్యామ్‌రావు, బట్టుపెల్లి రమేష్ చారి, శ్రీరామ్ సతీష్, ఆరెందుల శ్రీను పాల్గొన్నారు.

## ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా మూకాడే ఉత్తమ్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా అంజి గ్రామానికి చెందిన ముఖాడే ఉత్తమ్‌కు నియమిస్తూ ఆదివారం వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ చైర్మెన్‌గా గాదిగూడ మండలానికి చెందిన సోయం మారుతితో పాటు పది మంది డైరెక్టర్లను నియమించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి వారికి సేవలను అందిస్తానని హామీ ఇచ్చారు. తనపై నమ్మకంతో పదవీ ఇచ్చినందుకు ధన్యవాదలు తెలిపారు.

## తొలిరోజు ప్రశాంతంగా గ్రూప్-2

- బందోబస్తు నడుమ పరీక్ష నిర్వహణ
- 4 వేలకు పైగా అభ్యర్థులు గైర్హాజరు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర పబ్లిక్ కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా, ఎలాంటి పొరపట్లకు తావులేకుండా జిల్లా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ పరీక్ష రెండు రోజుల పాటు జరిగనుండగా, తొలిరోజు ఆదివారం సాఫీగా సాగింది. పరీక్ష కేంద్రల వద్ద అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి అనంతరం లోనికి అనుమతించారు. అభ్యర్థులు కూడా పరీక్ష సమయం కంటే గంట ముందే కేంద్రానికి చేరుకున్నారు. అయితే నిమిషాం ఆలస్యం నిబంధన కారణంగా పలువురు అభ్యర్థులు వెనుదిరాగాల్సి వచ్చింది. అదే విధంగా ఆయా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించగా డీఎస్పీ జీవన్ రెడ్డి పర్యవేక్షించి సూచనలు చేశారు.

**4 వేలకు పైగాఅభ్యర్థులు గైర్హాజరు**

జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షకు దాదాపు 4 వేలకు పై చిలుకు అభ్యర్థులు గైర్హాజరయ్యారు. కొంత మంది ఉదయం సెషన్‌లో పరీక్షకు హాజరై మధ్యాహ్నం సెషన్‌కు గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్ లో 10,428 మందికి గాను 5905 మంది హాజరు కాగా 4523 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం సెషన్‌లో 5864 మంది హాజరు కాగా 4564 మంది గైర్హాజరయ్యారు.

**పరీక్ష కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ**



మావలలోని చావరా అకాడమి, మహాత్మ గాంధీ జ్యోతి బాపూలే, భుక్తాపూర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను కలెక్టర్ రాజర్షిషా సందర్శించి తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు, అభ్యర్థుల హాజరు, బయోమెట్రిక్ విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సోమవారం కూడా పరీక్ష ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో ఉంటుందని, అభ్యర్థులు సమయానికి కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని పలు గ్రూప్ 2 పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఆదివారం సందర్శించారు. గ్రూప్ 2 పరీక్ష ప్రశాంత వాతావరణంలో కొనసాగుతుందని, అన్ని కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమల్లో ఉన్నందున ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు అనుమతులు లేవని ప్రజలు గుంపులు గుంపులుగా ఉండరాదని తెలియజేశారు. జవాబు పత్రాలు తరలింపులో కూడా ప్రత్యేక పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు నడుమ తరలించినున్నట్లు పేర్కొన్నారు.

**పరీక్షకు పలువురు అభ్యర్థులు దూరం**




పలువురు అభ్యర్థులు ఆలస్య కారణంతో పరీక్షకు దూరమయ్యారు. 9.30 నిమిషాలకు గేట్లు మూసివేసి అనంతరం పలువురు అభ్యర్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. అధికారులను వేడుకున్నప్పటికి అనుమతికి నిరాకరించారు. నలందా పరీక్ష కేంద్రం వద్ద ఆలస్యంగా రావడంతో లోనికి అనుమతించలేదు. దీంతో అభ్యర్థి కన్నీరు పెట్టుకొని బాధపడింది. ఇలాగే పదుల సంఖ్యలో అభ్యర్థులు పరీక్షకు హాజరుకాకుండా చేసేదేమి లేక వెనుదిరిగారు. ఆలస్యమైతే అనుమతించారని తెలిసి కూడా చాలా మంది అవగాహన రహిత్యంగా వ్యవహరించడం గమనార్హం.

## మోడుబారిన పల్లె ప్రకృతివనం

నవతెలంగాణ-బోథ్

గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశ్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లె ప్రకృతివనంలో సేదదీరడానికి వివిధ రకాల పూల మొక్కలు, నీడనిచ్చె మొక్కలు నాటించింది. అందులో భాగంగానే ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. అంత వరకు బాగానే ఉన్న సాలూర మండలం పాత సాలంపాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనంలో మాత్రం ఏపుగా పెరిగిన చెట్లను నరికివేశారు. దాంతో పల్లెప్రకృతివనం మోడుబారిన వనంలా తయారైంది. వేల రూపాయలు వెచ్చించి పల్లె ప్రకృతివనంలో మొక్కలు పెంచితే ప్రస్తుతం పెరిగిన చెట్లను సగం వరకు నరికివేయడంపై గ్రామస్థులు పంచాయతీ సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## ఆశాజనకంగా కంది పంట

నవతెలంగాణ-రెంజల్

కొందరు రైతులు తమ భూముల్లో పంట సాగుకు సరిపడా నీరు లేకపోవడంతో ఆరుతడి పంటలపై దృష్టి సారిస్తున్నారు. అందుకు నిదర్శనం మండలంలోని నీలా గ్రామానికి చెందిన ఓ రైతే. రైతు కరీముద్దీన్ ప్రస్తుతం కంది పంట సాగుచేస్తున్నాడు. పంట ప్రస్తుతం ఆశాజనకంగా ఉందని ఆయన తెలిపారు. వరి పంటకు బదులుగా పొగాకు, కంది, సోయా, పంటలను పండిస్తూ అధిక లాభాలను గడిస్తున్నట్లు ఆయన పేర్కొన్నాడు. తక్కువ నీటితో పంటలు పండించుకునే అవకాశం ఉందని ఆయన తెలిపాడు. తన 4 ఎకరాల భూమిలో కంది పంట వేయగా.. ప్రస్తుతం ఈ పంట పూత విరగబూసిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

# సీసీఐ నిర్లక్ష్యం.. రైతుకు శాపం..

- మరో రెండో రోజుల వరకు సీసీఐ కొనుగోళ్లు బంద్
- ఇప్పటికే జిన్నింగ్ మిల్లుల వద్ద బారులు తీరిన పత్తి వాహనాలు
- గ్రామాలలో రైతుల ఇళ్ల ముందు కూడా ఇదే పరిస్థితి



కౌటాలలో జిన్నింగ్ మిల్లు ముందు బారులు తీరిన పత్తి వాహనాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోగా, వచ్చిన ధరకైనా అమ్ముకుందామనుకున్న రైతులకు చిక్కులు తప్పడం లేదు. జిల్లాలో పత్తి పంట సాగు చేసిన రైతులు ఆ పంటను అమ్ముకుందామని వాహనాలలో జిన్నింగ్ మిల్లులకు తీసుకువెళితే అక్కడ రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీనికి కారణం కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారుల నిర్లక్ష్యమేనని చెప్పవచ్చు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 15 జిన్నింగ్ మిల్లులలో సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపడుతోంది. వాంకిడిలో రెండు, ఆసిఫాబాద్‌లో ఐదు, కొండపల్లిలో ఐదు, కౌటాలలో రెండు జిన్నింగ్ మిల్లులతో ఈ కొనుగోళ్లు చేపడుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో పత్తి పంట విరివిగా సాగు చేశారు. ఇప్పటికే రెండు విడతలుగా రైతులు పత్తి పంటను ఏరి విక్రయానికి తరలిస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో మూడో విడత ఏరివేత కూడా కొనసాగుతోంది. ఈ క్రమంలో సీసీఐ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతోంది. సెలవులు, సాంకేతిక కారణాలు, జిన్నింగ్ మిల్లులలో కాటన్ నిల్వలు పేరుకుపోయాయనే తదితర కారణాలతో రోజుల తరబడి పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నారు. దీనితో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. శని, ఆదివారాలు రెండు రోజుల పాటు సెలవు దినాల పేరుతో జిన్నింగ్ మిల్లులలో సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపట్టలేదు. సోమవారం నుండి అయినా పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని రైతులు తమ పంటను వ్యాన్‌లలో లోడ్ చేసి ఆదివారం జిన్నింగ్ మిల్లులకు తరలించారు. మరికొంత మంది రైతులు తమ ఇళ్ల వద్ద వాహనాలలో లోడ్ చేసి ఉంచారు. సోమవారం నుండి పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని ఆశతో ఉన్న రైతులకు ఆదివారం మధ్యాహ్నం మరో రెండు రోజులు కూడా సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపట్టడం లేదని తెలియడంతో వారు ఆందోళనకు గురవతున్నారు. ఇప్పటికే వాహనాలలో లోడ్ చేసి పత్తిని జిన్నింగ్ మిల్లులకు తరలించిన రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మరో రెండు రోజులు వాహనాలను పత్తి లోడ్‌తో ఉంచితే వాహనాల యాజమానులు వెయిటింగ్ ఛార్జీలు వేస్తారని ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా రాత్రి వేళల్లో ఆ వాహనాల వద్ద ఉండడం గగనంగా మారింది. రోజురోజుకు పెరుగుతున్న చలి కారణంగా ఆ వాహనాల వద్ద రాత్రంతా ఉండే పరిస్థితి లేదు. తమకు ముందస్తు సమాచారం ఇస్తే తాము వాహనాలలో పత్తి లోడ్ చేసి ఉండేవారం కాదని, ఇది సీసీఐ అధికారుల నిర్లక్ష్యమేనని రైతులు మండిపడుతున్నారు.

**అధికారుల మధ్య సమన్వయలోపం**

కాగా రెండు రోజుల పాటు పత్తి కొనుగోళ్లు చేపట్టడం లేదనే విషయంపై అటు సీసీఐ అధికారులకు, ఇటు మార్కెట్ కమిటీ అధికారులకు మధ్య సమన్వయం లేదని స్పష్టంగా అర్థమవుతోంది. సోమ, మంగళవారాలు రెండు రోజుల పాటు పత్తి కొనుగోళ్లు ఉండవని మార్కెట్ కమిటీ కార్యదర్శికి ముందస్తు సమాచారం ఇచ్చామని సీసీఐ ఇన్‌ఛార్జి వెంగళరెడ్డి తెలిపారు. జిన్నింగ్ మిల్లులలో కాటన్ నిల్వలు పేరుకపోయాయని, ఆ పత్తిని రెండు రోజులలో తరలించి, ఆ తర్వాత నుండి పత్తి కొనుగోళ్లు చేపడతామని ఆయన తెలిపారు. మరో వైపు కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఓదేలును సంప్రదించగా తనకు ముందస్తు సమాచారం లేదని, దీనిపై ప్రకటన చేయాల్సింది సీసీఐ అధికారులేనని స్పష్టం చేశారు.



చింతలమానేపల్లిలో రైతు ఇంటి ముందు లోడ్ చేసి ఉన్న పత్తి వాహనం

## ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్య అసెంబ్లీలో ప్రస్తావిస్తా

- సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సమస్యను నేటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు అన్నారు. కలెక్టరేట్ ఎదుట ఆరు రోజులుగా నిరసన తెలుపుతున్న సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులకు సంఘీభావంగా ఆదివారం దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే ఈ విషయంలో చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. చాలీచాలని జీతాలతో శ్రమ దోపిడీకి గురవుతున్న సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగుల సాధక బాధకాలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలిపారు. న్యాయమైన డిమాండ్ల సాధనకై ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్, ప్రత్యేకాధికారిని అరుణ, మెసెంజర్ల సంఘం జిల్లా అధ్యక్షులు సంతోష్, సీసీఓ సంఘం జిల్లా అధ్యక్షులు అనూప్, ఎంఐఎస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, సీఆర్పీ అధ్యక్షుడు పవన్, కోశాధికారి సందీప్, పీటీఐ అధ్యక్షుడు సత్యనారాయణ, రమేష్, మహేష్, ప్రకాష్, తిరుపతి, శివరాం, ప్రసన్న, స్వప్న, సరస్వతి, సునీల్, సతీష్, పవన్ పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీలు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలను ఆదివారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దని, మైనర్లు వాహనాలు నడిపితే జరిమానాతో పాటు శాఖపరమైన చర్యలు తప్పవని పోలీసులు సూచించారు. ఈ వాహనా తనిఖీలలో ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ సిబ్బంది ఉన్నారు.

## బాపూజీ వాచనాలయం కాపాడుకోవడం మనందరి బాధ్యత

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బాపూజీ వచనాలయాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బాపూజీ వచనాలయ పరిరక్షణ సమితి కమిటీ సమావేశాన్ని బాపూజీ వచనాలయ పరిరక్షణ సమితి కన్వీనర్ కోనేరు సాయికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ.. వచనాలయం ప్రజలకు అందుబాటులో, జిల్లా కేంద్రం నడిబొడ్డులో ఉందని, వాచనాలయాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. తమ పార్టీ తరపున వాచనాలయ పరిరక్షణ సమితికి పూర్తిగా సహకరిస్తామని అన్నారు. సిపిఐ నగర కార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు తలపించే విధంగా బాపూజీ వాచనాలయ ఎన్నికలు జరిగాయని తెలిపారు. గతంలో పనిచేసిన అధ్యక్షులు, ప్రస్తుత అధ్యక్షులు అని చెప్పుకుంటున్న వ్యక్తి తమకు అనుకూలంగా ఉన్నవారిని సభ్యులుగా చేర్పించి గెలిచారని అన్నారు. ఈ అక్రమార్కుల గుప్పిట్లో వచనాలయంలో వీరు అక్రమాలకు పాల్పడుతున్నారని, వీరికి వ్యతిరేకంగా పోరాటంలో తమ పార్టీ ప్రతి కార్యక్రమంలో కలిసి ఉంటుందని తెలిపారు. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ తరఫున శివ మాట్లాడుతూ బాపూజీ వచనాలయం కొంతమంది తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి, ఎందుకు ఇంత అష్ట కష్టాలు పడుతూ ఎన్నికల్లో ఇతరులు పోటీ చేయించ నీయకుండా 5 సంవత్సరాలు 3 సంవత్సరాలు అంటూ నిబంధనలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. పౌర హక్కుల సంఘం నాయకులు ప్రముఖ న్యాయవాది ఆల్గోట్ రవీందర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇంతవరకు బాపూజీ వచనా లయంలో ఏం జరుగుతుందో తెలియదని, కానీ ఎన్నికల ద్వారా వాస్తవాలు కొన్ని బయటకు వస్తున్నాయని, పూర్తి వాస్తవాలు బయటపెట్టి వచనాలయాన్ని పేద ప్రజలకు, పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం వెళ్లే వారికి ఉపయోగపడేటట్లు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు విద్యార్థి నాయకుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం



నవతెలంగాణ-కెరమెరి

ప్రమాదవశత్తు గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన సంఘటన ఆదివారం మండలంలోని తుమ్మగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కోలాం గూడాలో చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న అగ్నిమాక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఆత్రం బారిక్ రావు వారసంత కావడంతో మండల కేంద్రానికి వెళ్ళాడు. ఆయన భార్య చేను పనులకు వెళ్లడంతో ఇంటి వద్ద పిల్లలు మాత్రమే ఉన్నారు. మధ్యాహ్న సమయంలో గ్యాస్ సిలెండర్ లికేజీతో ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో పిల్లలు బయట ఆడుకుంటుండటంతో ప్రాణప్రాయం నుంచి బయటపడ్డారు. ఈ సంఘటనలో బారిక్ రావు ఇల్లు పూర్తిగా దగ్ధం కాగా, పక్కనే ఉన్న ఇల్లు పాక్షికంగా కాలిపోయింది. మంటల్లో ఫ్రిజ్, ఎల్ఈడీతో పాటు నగదు, నగలు కాలిపోయినట్టు తెలిపారు.



# మత్స్య సంపదకు గడ్డుకాలం

- 25 శాతం పూర్తికాని చేప పిల్లల విడుదల
- టెండర్లలో జాప్యం



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లాలో ప్రాజెక్టులకు, చెరువులకు, కుంటలకు ఇలా జలాశయాలకు కొదవలేదు. అటువంటిది జిల్లాలో ఈ ఏడాది మత్స్య సంపదకు గడ్డుకాలం ఏర్పడింది. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత గత ప్రభుత్వ హయాంలో జలాశయాల్లో చేప పిల్లలు కొనుగోలు చేసి, టెండర్లు వేసి, సకాలంలో చేప పిల్లలు విడుదల చేసేది. కానీ ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతుంది. జలాశయాలు నిండుగా ఉన్నా. జిల్లాలో చేప పిల్లలు విడుదల చేసి మత్స్యకారులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికి టెండర్ వేయడంలో ఆలస్యం చేయడంతో చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు అన్న చందంగా జిల్లా పరిస్థితి ఏర్పడింది. ప్రతి ఏడాది జలాశయాల్లో వేసే చేప పిల్లల సంఖ్య, గతంతో పోలిస్తే ప్రస్తుతం 50 శాతం చేప పిల్లలు వేసే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 100 శాతం వేయాల్సిన పిల్లలు 50 శాతానికి పరిమితం చేశారు. అలాగే అందులో ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా చేప పిల్లల విడుదల కేవలం 25 శాతం పూర్తి కావడం సంశయానికి గురిచేస్తుంది. జిల్లాలో మత్స్యకారుల చేపలపై ఆధారపడ్డ వారిపై మనుగడ కష్టతరంగా మారింది. ప్రస్తుతం జలాశయాలు నీటిమట్టం కొద్దిగా కొద్దిగా తగ్గుతూ రావడంతో ఇకపై చేపల పిల్లలు వేసిన ప్రయోజనం చేకూరదని తెలుస్తుంది. రాబోయే రోజుల్లో మత్స్యకారులకు కష్ట కాలంతో పాటు కడుపుకోత తప్పదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రభుత్వ నిర్లక్ష్యం టెండర్లు ఆలస్యం**

నిర్మల్ జిల్లాలో నాలుగు ప్రాజెక్టులైన స్వర్ణ, కడెం, గడ్డెన్న ప్రాజెక్టులు, అలాగే నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎస్సారెస్పీ ప్రాజెక్టులు జిల్లాకు ఆనుకొని ఉంది. అలాగే 648 పైగా చెరువులు, కుంటలు చేప పిల్లల పెంపకానికి అనుకూలంగా ఉన్నాయి. ప్రతి ఏడాది చేప పిల్లలను గత ప్రభుత్వ హయాంలో ఈ జలాశయాలు చేప పిల్లలను విడుదల చేసేది. సుమారు ఈ జలాశయాలలో 4 కోట్ల 78 లక్షలు చేప పిల్లలు వేస్తూ వచ్చేది. అయితే ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల చేప పిల్లలు విడుదల ఆలస్యమైంది. సాధారణంగా ప్రతి ఏడాది వర్షాకాలం ప్రారంభం తర్వాత జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలో చేప పిల్లలు విడుదల చేసేవారు. కానీ ఈ ఏడాది విడుదల చేయలేదు. కాగా ప్రస్తుత ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ 100 శాతం కాకుండా 50 శాతానికి తగ్గించింది. దీంతో ఈ ఏడాదిలో కేవలం 2 కోట్ల 30 లక్షల చేప పిల్లల విడుదల చేయాలని నిర్ణయించింది. అయినప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో టెండర్లు సైతం ఆలస్యం కావడంతో జిల్లాలో కేవలం 1 కోటి 83 లక్షల చేప పిల్లలు విడుదల చేశారు. అంటే ఇచ్చిన లక్ష్యంలో 25 శాతం సైతం చేప పిల్లల విడుదల చేయలేదు. దీంతో మత్స్యకారులతో మత్స్య సంపదపై సంశయానికి గురిచేస్తుంది.

**భవిష్యత్తులో మత్స్యకారులకు మనుగడ ప్రశ్నార్థకం..**

నిర్మల్ జిల్లాలో 222 మత్స్యకార సొసైటీలు ఉన్నాయి. చేపలు పట్టుకొని ఉపాధి పొందేవారు. 13,190 మత్సకారులు ఉన్నారు. దీంతో పాటు వేల సంఖ్యలో ఈ మత్స్య సంపదపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. ఈ ఏడాది వర్షాలు కురిసి చెరువులు, ప్రాజెక్టులలో నీరు నిండుగా ఆశాజనకంగా ఉన్నప్పటికీ, సరైన సమయంలో చేప పిల్లలు విడుదల చేయకపోవడంతో ప్రస్తుత పరిస్థితుల్లో చేపలు పిల్లలు విడుదల చేసినప్పటికీ లాభం లేకుండా పోతుంది. ఎందుకంటే నిర్ణీత గడువులో విడుదల చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీనికి కారణం క్రమక్రమంగా జలాశయాల్లో నీటి శాతం ప్రస్తుతం తగ్గుతూ వస్తుంది. చేప పిల్లలు విడుదల చేసిన అవసరానికి తగ్గట్టు చేప పిల్లల ఎదుగుదల లేక ప్రయోజనం చేకూరే అవకాశం లేకపోలేదు. దీంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. కేవలం ప్రభుత్వం గతంతో పోలిస్తే 50 శాతం చేప పిల్లల విడుదల లక్ష్యం పెట్టుకుని, జిల్లాలో వేయడానికి నిర్ణయించింది. అందులో కేవలం 25 శాతమే చేప పిల్లల విడుదల చేయడం లాంటి విషయాలు మత్స్య సంపదపై అనుమానాలు రేకిస్తున్నాయి. జీవనోపాధి పొందుతున్న మత్స్యకారులకు రాబోయే రోజుల్లో ఉపాధి కోల్పోవడంతో పాటు కుటుంబ పోషణ భారంగా మారే అవకాశాలు లేకపోలేదు. ప్రత్యామ్నాయ మార్గాలు ప్రభుత్వం అధికారులు ఆలోచించి, ఒక నిర్ణయానికి వచ్చి మత్స్యకారులకు లాభం కూర్చేలా నిర్ణయం తీసుకుంటే తప్ప, తమకు న్యాయం జరగదని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఎలాగైనా ప్రభుత్వం తమని ఆదుకోవాలని వారు కోరుకుంటున్నారు.

### మరికొన్ని రోజుల్లో ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేస్తాం

**రాజేశ్వర్, మత్స్యశాఖ జిల్లా అధికారి**



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రెండు కోట్ల 37 లక్షల చేప పిల్లలను జలాశయాల్లో విడుదల చేయాలి. కొంత టెండర్లు ఆలస్యం కావడంతో ఒక కోటి 83 లక్షల చేప పిల్లలు విడుదల చేసాం. త్వరలో మిగితావి విడుదల చేస్తాం.